నవతెలంగాణ
ఆదిలాబాద్
మంగళవారం | ఏప్రిల్ 23, 2024 | www.navatelangana.com

ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో లెనిన్ 154వ జయంతి వేడుకలు

నవతెలంగాణ-నిర్మల్



ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో లెనిన్ 154వ జయంతి వేడుకలను సోమవారం జిల్లా కేంద్రంలోని ప్రజాసంఘాల కార్యాలయంలో నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు నామత్కర్ నవీన్ మాట్లాడారు. ఐక్య సంఘటన నిర్మాణంలో ఎత్తుగడలే కీలకమని కార్మికులు, వ్యవసాయ కార్మికులు, రైతాంగం మధ్య ఐక్య సంఘటనను ప్రతిపాదించినది లెనిన్ అని కొనియాడారు. అభివృద్ధి చెందిన దేశాలలోనే సోషలిజం సాధ్యం అని, సాంప్రదాయ అభిప్రాయం తప్పు అని, సామ్రాజ్యవాద వ్యవస్థ అభివృద్ధి చెందుతున్న దశలో పెట్టుబడి దారీ వ్యవస్థ అనుసరించే విధానం వలన పెరిగే అసమాన అభివృద్ధి వల్ల వెనుకబడిన దేశాలలో సోషలిజం సాధించడం సాధ్యమేనని ఆనాడే వెల్లడించారని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు ఉప్పరి సత్యం, సతీష్, రజిత పాల్గొన్నారు.

గాలివాన బీభత్సం

నవతెలంగాణ-నార్నూర్



మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం రాత్రి కురిసిన వర్షంతో పాటు గాలి బీభత్సం సృష్టించింది. దీనితో మాన్కాపూర్ గ్రామంలో మెస్రం ప్రభాకర్, మెస్రం సోము ఇండ్లపై నుంచి రేకులు గాలిలో ఎగిరిపోయి ధ్వంసమైయ్యాయి. ఆవులు, మేకలు గాయాల పాలయ్యాయి. ఇంచు మించు లక్షపైన నష్టం వాటిల్లినట్టు మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మెన్ తొడసం నాగోరావ్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో సోమవారం పరిశీలించి, బాధితులను పరామర్శించారు. సంబంధిత శాఖ అధికారులు సర్వే చేసి బాధితులకు నష్టపరిహారం ఇచ్చి ఆదుకోవాలని కోరారు.

మోడీ..కేసీఆర్ ఒక్కటే

- వారిద్దరు కాంగ్రెస్ సర్కారుపై విషం గక్కుతున్నారు
- ప్రభుత్వాన్ని పడగొట్టాలని చూస్తున్నారు
- సర్కారు పడిపోతే కోట్లాది మంది పేదలకు నష్టం
- ఇది వరకు కేసీఆర్‌ను బండకేసి కొట్టాం..మోడీని అలాగే చేయాలి
- ఆదిలాబాద్ జనజాతర సభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- ప్రాణహిత, కుప్టి ప్రాజెక్టు నిర్మించి..సీసీఐ తెరిపిస్తామని భరోసా
- ఎన్నికల్లో ఎంపీ అభ్యర్థిని గెలిపించాలని పిలుపు





నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

ప్రధాని మోడీ.. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఇద్దరు ఒక్కటే. ఈ ఇద్దరు ప్రభుత్వాన్ని పడగొడుతామని చెబుతున్నారు. ఎందుకు కూలగొడుతారు..?ఆరోగ్యశ్రీ కింద పేదలకు రూ.10లక్షల వైద్య సహాయం చేస్తున్నందుకా..మహిళలకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణం కల్పిస్తున్నందుకా..రూ.500లకే గ్యాస్ పంపిణీ చేస్తున్నందుకా..పేదలకు ఉచితంగా 200యూనిట్లు విద్యుత్తు సరఫరా చేస్తున్నందుకా..ఎందుకు కూలగొట్టాలి ఈ ప్రభుత్వాన్ని అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ధ్వజమెత్తారు. ఈ ప్రభుత్వం కూలిపోతే వారికి నష్టం ఉండదు కానీ కొట్లాది మంది పేదలకు నష్టం జరుగుతుందని చెప్పారు. మోడీ..కేసీఆర్‌లు ఇద్దరు కాంగ్రెస్ ప్రభుత్వంపై విషం గక్కుతున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరు గ్యారెంటీ పథకాలు పేదలకు అందకూడదనే ఉద్దేశంతోనే వారు ఈ కుట్రలకు తెరలేపుతున్నారని ఆక్రోషం వెళ్లగక్కారు. సోమవారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ నిర్వహించిన జనజాతర సభకు సీఎం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ తరపున లోక్‌సభకు పోటీ చేస్తున్న ఆత్రం సుగుణను గెలిపించాలని అభ్యర్థించారు. అనంతరం రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించడంతో పాటు బీజేపీ, బీఆర్ఎస్‌ల వైఖరిపై తీవ్ర విమర్శలు గుప్పించారు. రాష్ట్ర ప్రభుత్వం ఆరు గ్యారెంటీల్లో భాగంగా ఇప్పటికే ఐదు పథకాలను అమలు చేస్తున్నామని సీఎం గుర్తుచేశారు. త్వరలోనే రుణమాఫీని కూడా అమలు చేస్తామని భరోసా ఇచ్చారు. సీఎంగా బాధ్యతలు చేపట్టిన 48గంటల్లోనే ఆర్టీసీలో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించామని, ఇప్పటి వరకు 35కోట్ల మంది ప్రయాణం చేశారని..ఆర్టీసీకి ప్రభుత్వం రూ.1325కోట్లు చెల్లించిందని తెలిపారు. మూతపడే ప్రమాదంలో ఉన్న సంస్థను కాపాడి 50వేల మంది కార్మికుల కుటుంబాలను ఆదుకున్నామని చెప్పారు. రాజీవ్‌ఆరోగ్యశ్రీ కింద పేదలకు రూ.10లక్షల వైద్యసహాయం, పేదలకు 200యూనిట్ల ఉచిత విద్యుత్తు, రూ.500గ్యాస్ సిలిండర్‌లను 45లక్షల కుటుంబాలకు పంపిణీ చేస్తున్నామని పేర్కొన్నారు. ఈ పథకాల అమలు చూసి కడుపు మండిన మోడీ, కేసీఆర్‌లు ఈ ప్రభుత్వాన్ని పడగొట్టాలని చూస్తున్నారని మండిపడ్డారు. పదేండ్లలో కేసీఆర్ ఒక్క డబుల్ బెడ్‌రూం కట్టలేదని..తమ ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్ల కోసం రూ.25,500కోట్లు కేటాయించిందని గుర్తుచేశారు. ఆరు గ్యారెంటీలను వంద రోజుల్లో ఎందుకు అమలు చేయలేదని అంటున్నారని.. పదేండ్ల పాలనలో పథకాలు అమలు చేయని కేసీఆర్ నడిబజారులో ఉరితీయాలనా..?పాతిపెట్టాలనో మీరే ఆలోచించాలని సూచించారు. ఈ ప్రభుత్వాన్ని పడగొడితే 30వేల ఉద్యోగాలు పొందిన యువతతో పాటు కోట్లాది మంది లబ్ధిదారులు ఊరుకుంటారా..అని ప్రశ్నించారు. కేసీఆర్‌ను గత డిసెంబర్‌లో జరిగిన ఎన్నికల్లో బండకేసి కొట్టారని..రానున్న ఎన్నికల్లో మోడీని అలాగే ఓడించాలని స్పష్టం చేశారు. ప్రధాని మోడీ ప్రజలను మోసం చేశారని, 2కోట్ల ఉద్యోగాలు, రూ.15లక్షల నగదు ఖాతాల్లో వేయలేదని, బయ్యారం ఉక్కు కర్మాగారం నిర్మించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. గుజరాత్‌కు బుల్లెట్‌ప్రూఫ్ రైలు, సబర్మతికి రివర్‌ను తీసుకెళ్లారని విమర్శించారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ ఓడిపోతే పథకాల అమలుపై ప్రభావం పడుతుందని తెలిపారు.





ప్రజల ఆకాంక్షలు నెరవేరుస్తాం

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఆదరించారు. రానున్న లోక్‌సభ ఎన్నికల్లోనూ కాంగ్రెస్‌ను ఆదరించాలని, ప్రజల ఆలోచనలు, ఆకాంక్షలు నెరవేర్చేందుకు శాయశక్తులా కృషిచేస్తామని సీఎం కోరారు. ఆరు గ్యారెంటీల్లో ఐదింటిని అమలు చేస్తున్నామని రూ.2లక్షల రుణమాఫీని త్వరలోనే అమలు చేస్తామని భరోసా ఇచ్చారు. మరోపక్క తుమ్మిడిహేటి వద్ద ప్రాణహిత ప్రాజెక్టును నిర్మిస్తామని..ఇందుకు మహారాష్ట్ర ప్రభుత్వంతో చర్చలు జరుగుతున్నాయని..అక్కడ 1900 ఎకరాల ముంపు పరిహారంపై ఒప్పిస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఈ ప్రాజెక్టుకు మళ్లీ డా.బీ.ఆర్.అంబేద్కర్ పేరు పెడుతామని హామీనిచ్చారు. ఆదిలాబాద్ జిల్లాలో యూనివర్సిటీ ప్రారంభిస్తామని, కుప్టి ప్రాజెక్టు నిర్మించి, సీసీఐని తెరిపిస్తామని చెప్పారు. వరిని చివరి గింజ వరకు కొనుగోలు చేసి రూ.500బోనస్ కూడా చెల్లిస్తామన్నారు. ఇంద్రవెల్లి అమరులకు ఇండ్లు, భూములు ఇచ్చామని, స్థూపాన్ని పర్యటక క్షేత్రంగా మారుస్తామని చెప్పారు. రానున్న లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను మరోసారి ఆదరించాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు సీతక్క, శ్రీధర్‌బాబు, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు, మాజీ కేంద్రమంత్రి వేణుగోపాలచారి, మాజీ ఎమ్మెల్యేలు కోనేరు కోనప్ప, రేఖానాయక్, రాథోడ్ బాపురావు, డీసీసీబీ చైర్మెన్ అడ్డి భోజారెడ్డి, నియోజకవర్గ ఇన్‌ఛార్జి కంది శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం

సీతక్క, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి



ఇది వరకు కాంగ్రెస్ ప్రభుత్వమే ఇందిరమ్మ ఇండ్లు, గ్యాస్ కనెక్షన్లు ఇచ్చింది. గుడులు, బడుల నిర్మాణం చేపట్టింది. ప్రాజెక్టులు కట్టించింది. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టినవే ఉన్నాయి. బీజేపీ, బీఆర్ఎస్‌లు చేసిందేమీలేదు. మోడీ అనేక హామీలు ఇచ్చి ఒక్కటీ నెరవేర్చలేదు. దేవుడి పేరుతో ఓట్లు అడగడం ఎంత వరకు సమంజసం. ఆరు గ్యారెంటీలు అమలు చేసి ఇచ్చిన మాట నిలబెట్టుకున్నాం. పేదింటి ఆడబిడ్డ ఆత్రం సుగుణను గెలిపించాలి.

మోడీ అసత్య ప్రచారం చేస్తున్నారు

శ్రీధర్‌బాబు, రాష్ట్ర మంత్రి



బీజేపీ మతతత్వ పార్టీ. కాంగ్రెస్ మేనిఫెస్టోలో లేని అంశాలను ప్రస్తావిస్తూ ప్రధాని మోడీ అసత్య ప్రచారం చేస్తున్నారు. ఈ పదేండ్ల పాలనలో బీజేపీ చేసిందేమీలేదు. ఆలయాల నిర్మాణం కాంగ్రెస్ ప్రభుత్వమే చేపట్టింది. బీఆర్ఎస్ జిల్లాకు అన్యాయం చేసింది. పేదింటి ఆడబిడ్డకు కాంగ్రెస్ టికెట్ ఇచ్చింది. గెలిపించుకోవాల్సిన బాధ్యత జిల్లా ప్రజలపై ఉంది.

పేదింటి బిడ్డను గెలిపించాలి

వెడ్మ బొజ్జు, ఖానాపూర్ ఎమ్మెల్యే



కాంగ్రెస్ పార్టీ పేదింటి ఆడబిడ్డకు టికెట్ ఇచ్చింది. ఎంపీ ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలిపించాలి. బీజేపీ నుంచి బరిలో ఉన్న గోడం నగేష్‌కు ఆదివాసీ సంప్రదాయాలపై నమ్మకం ఉండదు. సుగుణపై దుష్ప్రచారం చేయడం తగదు.గతంలో ఆయన ఎలాంటి అభివృద్ధి చేయలేదు. కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించాలని విజ్ఞప్తి చేస్తున్నాం.

కొంగుచాచి అడుగుతున్నా ఓటేయండి

ఆత్రం సుగుణ, కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి



కాంగ్రెస్ పార్టీ తొలిసారి మహిళకు టికెట్ ఇచ్చింది. కొంగుచాచి అడుగుతున్నా నాకు ఓటేయండి. ప్రశ్నించే గొంతుకగా పార్లమెంటుకు పంపించండి. చనిపోయే వరకు పేదలకు కష్టసుఖాల్లో భాగస్వామిగా ఉంటాను. ఒక్క అవకాశం కల్పించండి. సమస్య పరిష్కారం కోసం శక్తి వంచన లేకుండా కృషిచేస్తాను.

మంత్రి సీతక్కతో కలిసి నామినేషన్



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణ మంత్రి సీతక్కతో కలిసి సోమవారం నామినేషన్ వేశారు. పట్టణంలోని కలెక్టరేట్ కార్యాలయంలో రిటర్నింగ్ అధికారి రాజర్షిషాకు ఆమె నామినేషన్ పత్రాలను సమర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జ పటేల్, మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప, నిర్మల్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు శ్రీహరిరావు ఉన్నారు. ఇప్పటివరకు ఆమె రెండు సెట్ల నామినేషన్ వేశారు.

తాగునీటి సమస్య ఏర్పడకుండా చూడాలి

నవతెలంగాణ-తలమడుగు

వేసవి కాలం నేపథ్యంలో ప్రజలకు నీటి సమస్య తలెత్తకుండా చూడాలని డీఎల్పీఓ ఫణీంద్ర పంచాయతీ కార్యదర్శి, కారోబారికి సూచించారు. సోమవారం మండలంలోని బరంపూర్ గ్రామంలో మిషన్ భగీరథ మంచినీటి ట్యాంకులను పరిశీలించారు. గ్రామాల్లో నీటి సమస్య ఏర్పడినప్పుడు మిషన్ భగీరథతో పాటు గతంలో నిర్మించిన మంచినీటి ట్యాంకులను, బోరుబావులను పర్యవేక్షించాలని సిబ్బందిని కోరారు. ట్యాంకులను ఎప్పటికప్పుడు బ్లీచింగ్‌తో శుభ్రపర్చాలని అన్నారు. అదేవిధంగా ట్యాంకుల పైకప్పు ఉండే విధంగా సిబ్బంది పర్యవేక్షణ ఉండాలని కోరారు. డీఎల్పీఓ వెంట ఎంపీఓ వినోద్, పంచాయతీ కార్యదర్శి అనిల్‌రెడ్డితో పాటు గ్రామపంచాయతీ సిబ్బంది, గ్రామస్తులు ఉన్నారు.



హామీల అమలులో కాంగ్రెస్ పూర్తిగా విఫలం

- మాజీ మంత్రి జోగు రామన్న

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



ప్రజలకు ఇచ్చిన హామీలు, పథకాల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, ప్రస్తుతం పార్లమెంట్ ఎన్నికల వేళ మరొకసారి ప్రజలను మాయమాటలతో మోసం చేయడానికి సీఎం ప్రయత్నిస్తున్నారని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు, మాజీ మంత్రి జోగు రామన్న అన్నారు. హామీల అమలుపై ముఖ్యమంత్రిని ప్రశ్నిస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో సోమవారం పార్టీ కార్యాలయంలో పోస్టల్ కార్డు ఉద్యమాన్ని ప్రారంభించారు. రైతు భరోసా, కౌలు రైతులు, రైతు కూలీలకు ఆర్థిక సాయం, నాలుగు వేల పెన్షన్ తదితర హామీలను పోస్టల్ కార్డుల్లో ప్రస్తావిస్తూ వాటిని ముఖ్యమంత్రి కార్యాలయానికి పంపించారు. ఈ సందర్భంగా జోగు రామన్న మాట్లాడుతూ ఆరు గ్యారంటీలలోని పదమూడు పథకాలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమయిందని అన్నారు. రెండు వందల యూనిట్‌లలోపు ఉచిత విద్యుత్తు, అయిదు వందలకే గ్యాస్ సిలిండర్ పథకాలు సైతం పూర్తిస్థాయిలో అమలు కావడం లేదని ఆరోపించారు. రైతు భరోసా కింద పదిహేను వేల రూపాయలు ఇస్తామని ప్రకటించారని, అదేవిధంగా నాలుగు వేల పెన్షన్‌పై సైతం ముఖ్యమంత్రి స్పష్టత ఇవ్వడం లేదని ధ్వజమెత్తారు. కళ్యాణ లక్ష్మి కింద ఇస్తామన్న తులం బంగారం సంగతేంటని ప్రశ్నించారు. ఎంపీ ఎన్నికల వేల రుణమాఫీపై కొత్త రాగం అందుకున్నారని విమర్శించారు. ముఖ్యమంత్రి మాటలను ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని అన్నారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ప్రజలే తగిన గుణపాఠం చెప్తారని స్పష్టం చేశారు. ప్రతి గ్రామం నుంచి పోస్టల్ కార్డు ఉద్యమం ద్వారా ప్రభుత్వానికి హామీలను గుర్తు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్, ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు, ఎంపీపీ తుల శ్రీనివాస్, నాయకులు పాల్గొన్నారు.


పరీక్షల్లో ఫెయిల్ అయితే ఆత్మహత్యలు చేసుకోవద్దు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

రెండు మూడు రోజుల్లో ఇంటర్మీడియట్ ఫలితాలు రానున్నాయని కొంతమంది విద్యార్థులు పరీక్షల్లో ఉత్తీర్ణులు కాకపోవడంతో నిరాశ చెంది ఆత్మహత్య లాంటి ప్రయత్నాలు చేసుకుంటారని అలా చేసుకోవద్దని జిల్లా ఎన్సీడి ప్రాజెక్టు అధికారి డాక్టర్ శ్రీధర్ మెట్టిపల్లి వార్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కొన్ని సందర్భాల్లో విద్యార్థులకు మార్కులు రాకపోవచ్చని దాన్ని ఛాలెంజ్‌గా తీసుకొని మళ్లీ పరీక్ష రాసి ఉత్తీర్ణులు కావాలే తప్ప నిరాశ చెంది ఆత్మహత్య వైపు చూడద్దని పేర్కొన్నారు. చాలా మంది విద్యార్థులు ఒత్తిడికిలోనై డిప్రెషన్ లోకి వెళ్లిపోయి, ఆత్మహత్యకు ప్రయత్నం చేస్తారని అది చట్టరీత్య నేరమని పేర్కొన్నారు. విద్యార్థులు పరీక్షలు తప్పినట్లయితే మళ్లీ పరీక్షల్లో రాసి ఉత్తీర్ణులు కావచ్చని పేర్కొన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు ఎంతో కష్టపడి విద్యార్థులను చదివిస్తారని వారిని దృష్టిలో ఉంచుకొని అఘాయిత్యాలకు పాల్పడవద్దని పేర్కొన్నారు. ఒకసారి పరీక్షలో తప్పినంత మాత్రాన బాధపడాల్సిన అవసరం లేదన్నారు. వెంటనే సప్లమెంటరీ పరీక్షలు ఉంటాయని వాటిలో ఉత్తీర్ణులై పరీక్షల్లో పాసైన వారితో సమానంగా మళ్లీ డిగ్రీలోకి వెళ్లవచ్చని పేర్కొన్నారు. తొందరపడి మానసికంగా కృంగిపోతూ ఆత్మహత్యలకు పాల్పడవద్దని చాలెంజిగా తీసుకొని చదివి మళ్లీ ఉత్తీర్ణులై తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని పేర్కొన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు కూడా పరీక్షల్లో ఫెయిల్ అయిన వారికి మంచి ధైర్యాన్ని ఇవ్వాలని కౌన్సిలింగ్ ఇవ్వాలని పేర్కొన్నారు. ఎందరో మంది విద్యార్థులు ఇంటర్మీడియట్‌లో ఫెయిల్ అయినవారు మళ్లీ సప్లమెంటరీలో పాస్ అయి వైద్యులుగాను ఇంజనీర్లుగాను ఉన్నత అధికారులు గాను అయ్యారని అన్నారు. ఎవరైనా ఇంటర్మీడియట్‌లో ఫెయిల్ అయిన విద్యార్థులు మానసికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లయితే టోల్ ఫ్రీ నెంబర్ 14416 నెంబర్‌కు ఫోన్ చేసి సమాచారం ఇచ్చినట్లయితే అక్కడికి తమ సిబ్బంది, మేము వచ్చి విద్యార్థులకు కౌన్సిలింగ్ ఇవ్వడం జరుగుతుందని పేర్కొన్నారు.

బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలకు షాక్

- సీఎం రేవంత్ రెడ్డి సమక్షంలో చేరికలు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ జిల్లాలో బీఆర్ఎస్, బీజేపీ పార్టీలకు షాక్ తగిలింది. డైట్ కళాశాల మైదానంలో జరిగిన జన జాతర సభలో కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇన్‌చార్జి కంది శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌కు చెందిన మున్సిపల్ వైస్ చైర్మెన్, పలువురు కౌన్సిలర్లు, బీజేపీ ముఖ్యనాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారందరికీ సీఎం రేవంత్‌రెడ్డి స్వయంగా కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఇదివరకే పలువురు కౌన్సిలర్‌లు కాంగ్రెస్‌లో చేరగా తాజాగా మరికొంతమంది కౌన్సిలర్‌లు కాంగ్రెస్‌లో చేరారు. తాజాగా చేరిన వారిలో మున్సిపల్ వైస్ చైర్మెన్ జహీర్ రంజానితోపాటు విద్యానగర్, రిక్షా కాలనీ, గాంధీనగర్ కౌన్సిలర్లు కలాల శ్రీనివాస్, ఆవుల వెంకన్న, మడావి మంగళ రామేశ్వర్, గుడిహత్నూర్ మాజీ ఎంపీపీ ఆడే శీల, బీజేపీ అధికార ప్రతినిధి లోక ప్రవీణ్‌రెడ్డిలు కాంగ్రెస్ కండువాలు కప్పుకున్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ముఖ్యనాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మంత్రి సమక్షంలో చేరికలు

కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇన్‌చార్జి కాంగ్రెస్ కంది శ్రీనివాస్‌రెడ్డి క్యాంపు కార్యాలయంలో మంత్రి సీతక్క సమక్షంలో బీఆర్ఎస్ పార్టీ నుంచి కాంగ్రెస్‌లోకి సోమవారం చేరికలు జరిగాయి. పట్టణంలోని రామ్‌నగర్ కు చెందిన నలగంటి నవీన్, అయిండ్ల శశికాంత్, ఈర్లా దయాకర్ జిల్లా ఇన్‌చార్జీ మంత్రి సీతక్క సమక్షంలో పార్టీలో చేరారు. సీతక్క వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

కోరం లేక సర్వసభ్య సమావేశం వాయిదా

నవతెలంగాణ-ముథోల్

మండలంలోని ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం ఎంపీపీ అయేషా అఫ్రోజ్ ఖాన్ అధ్యక్షతన జరగాల్సిన సర్వసభ్య సమావేశం కోరం లేక వాయిదా వేసినట్టు ఎంపీడీఓ రాములు తెలిపారు. మరల నిర్వహించే సర్వసభ్య సమావేశం తేదీని తెలియజేస్తామని అన్నారు.

నవతెలంగాణ
ఆదిలాబాద్-నిర్మల్
మంగళవారం | ఏప్రిల్ 23, 2024 | www.navatelangana.com

బాధిత కుటుంబాలకు పరామర్శ

నవతెలంగాణ-కుభీర్



మండలంలోని పార్డీ(కె) గ్రామానికి చెందిన అజయ్‌కుమార్, కుభీర్‌కు చెందిన బొప్పా రవికుమార్ ఇద్దరు వ్యక్తులు ఇటీవల వేర్వేరు ప్రమాదంలో మరణించారు. సోమవారం విషయం తెలుసుకున్న ముధోల్ తాలూకా మున్నూరుకాపు అధ్యక్షుడు రాళ్ల రమేష్, ఎమ్మెల్యే రామారావు పటేల్ బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. అదే విధంగా పార్డీ(కె) గ్రామానికి చెందిన మెంచు రాములు ఇటీవల అనారోగ్యంతో మరణించడంతో వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపి వారికి మనోధైర్యాన్ని చెప్పారు. ఆయన వెంట తాలూకా కార్యవర్గ సభ్యులు చిమ్మన్ పోశెట్టి, పుప్పాల పీరాజి, రాములు, కుభీర్ అధ్యక్షుడు అరవింద్, ఆకుల గంగాధర్, బండెల శంకర్, సాతం శంకర్, నర్సయ్య, మున్నూరుకాపు సభ్యులు ఉన్నారు.

ఆత్రం సక్కును అత్యధిక మెజార్టీతో గెలిపించాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్



ఆత్రం సక్కును అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఎంపీపీ గండ్రత్ రమేష్ అన్నారు. సోమవారం మండలంలోని అంకాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలో పందిరిలోద్ది, చిన్న పందిరిలోద్ది, మారుతిగూడలో కారు గుర్తుకు ఓటు వేసి ఆత్రం సక్కును భారీ మెజార్టీ తో గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వంలో అనేక సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టిందని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు భూమన్న, కార్యకర్తలు పాల్గొన్నారు.

బిర్యానిలో బొద్దింక దర్శనం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



ఓ హోటల్ బిర్యానిలో బొద్దింకలు దర్శనమిచ్చిన ఘటన జిల్లా కేంద్రంలో చోటుచేసుకుంది. పట్టణంలోని ఓ హోటల్‌లో ఓ యువకుడు సోమవారం వెళ్లి వెజ్ బిర్యానీ ఆర్డర్ ఇచ్చాడు. వేటర్ బిర్యానీ తీసుకురాగా అందులో బొద్దింకలు, బొద్దింక రెక్కలు కనిపించాయి. దీంతో సదరు యువకుడు షాక్ అయ్యాడు. ఈ విషయాన్ని హోటల్ సిబ్బందిని అడిగితే నిర్లక్ష్యపు సమాధానం చెబుతూ, బిర్యానీ మార్చి ఇస్తామని తెలిపారని యువకుడు పేర్కొన్నారు.

ఐదో రోజు మూడు నామినేషన్‌లు



నవతెలంగాణ-ఆదిలాబాద్ టౌన్

ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గానికి సంబంధించి సోమవారం ఐదవ రోజు మూడు నామినేషన్లు దాఖలు అయ్యాయని జిల్లా రిటర్నింగ్‌అధికారి రాజర్షి షా తెలిపారు. స్వతంత్ర అభ్యర్థులుగా మెస్రం గంగాదేవి, రాథోడ్ సుభాష్, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా ఆత్రం సుగుణ నామినేషన్ చేశారని పేర్కొన్నారు. ఆదిలాబాద్ కలెక్టర్ ఛాంబర్ లో ఏర్పాటు చేసిన ఆర్. ఓ. కార్యాలయంలో మూడు నామినేషన్ల పత్రాలు అందజేశారని తెలిపారు.

ఉచిత సాఫ్ట్‌బాల్ వేసవి శిక్షణ శిబిరం

నవతెలంగాణ-నేరడిగొండ

ఉచిత సాఫ్ట్‌బాల్ వేసవి శిక్షణ శిబిరాన్ని మే 1 నుంచి 31వరకు మండల కేంద్రంలోని కుంటాల రోడ్డు సమీపంలోని గ్రౌండ్‌లో నిర్వహిస్తున్నట్టు సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి గస్కంటి గంగాధర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో పాల్గొనే క్రీడాకారులకు సాఫ్ట్‌బాల్ మెలకువలు నేర్పిస్తామని తెలిపారు. అదేవిధంగా సర్టిఫికెట్స్ అందజేస్తారని పేర్కొన్నారు. క్రీడాకారులు అందరూ ఉచిత శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు ఎన్ఐఎస్ కోచ్ ఓరగంటి అఖిలను సంప్రదించాలని కోరారు.

బహిరంగ సభకు బయలుదేరిన నాయకులు



నవతెలంగాణ-ఉట్నూర్

ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని డైట్‌గ్రౌండ్‌లో తలపెట్టిన జనజాతర భారీ బహిరంగ సభకు ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్‌తో పాటు ఉట్నూర్ మండలాల నుంచి భారీగా కార్యకర్తలు తరలివెళ్లారు.

రోడ్డు భద్రపై అవగాహన



నవతెలంగాణ-నిర్మల్

ఆర్టీసీ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కేంద్రంలోని శివాజీచౌక్‌లో రోడ్డు భద్రపై అవగాహన సదస్సు నిర్వహించారు. రోడ్డుపైన ద్విచక్ర వాహనాలు నడిపే వారు హెల్మెట్ ధరించాలని, కార్లు నడిపే వారు సీట్ బెల్టులు పెట్టుకోవాలని ఆర్టీసీ సిబ్బంది పోశెట్టి, ఎల్.నర్సయ్య తెలిపారు. అలాగే ఆర్టీసీ బస్సు వివరాలను తెలిసుకోవడానికి గమ్యం యాప్‌ను తమ తమ ఫోన్‌లలో ఇన్‌స్టాల్ చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో శివాజీచౌక్‌లోని వాహనదారులు పాల్గొన్నారు.

ముధోల్‌లో వడగండ్ల వర్షం

నవతెలంగాణ-ముధోల్

మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో సోమవారం సాయంత్రం ఈదురు గాలులతో కూడిన వడగండ్ల వర్షం కురిసింది. దీంతో రైతులు ఆందోళనకు గురయ్యారు. చేతికి వచ్చిన వరి పంట వడగండ్ల వర్షంతో నెలరాలాయి. కల్లంలో ఉన్న వరి ధాన్యం, మక్కలు తడిసి పోయాయి. దీంతో రైతులు నిరాశ చెందుతున్నారు. ఈ వడగండ్ల వర్షంతో రైతులకు తీవ్ర నష్టం కలిగించింది.



అవకాశమివ్వండి అభివృద్ధి చేసి చూపిస్తాం

- జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క



నవతెలంగాణ-లక్ష్మణచాంద

కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణకు ఒక అవకాశమివ్వాలని అభివృద్ధి చేసి చూపిస్తామని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క అన్నారు. నిరుపేద మహిళకు అవకాశం ఇస్తే అభివృద్ధికి కట్టుబడి ఉంటుందని మంత్రి తెలిపారు. సోమవారం మండల కేంద్రంలో పార్లమెంట్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. త్యాగాల పార్టీ కాంగ్రెస్‌తో మాత్రమే అభివృద్ధి సాధ్యమని పేర్కొన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ జంట పార్టీలు అని దుయ్యబట్టారు. బీఆర్ఎస్‌కు ఓటు వేస్తే మురుగు కాలువలో వేసినట్లేనని పేర్కొన్నారు. గుడిలో ఉండాల్సిన దేవుడిని జెండాలపై వేసి ఊరేగింపులు చేస్తూ మత రాజకీయాలకు బీజేపీ నాయకులు పాల్పడుతున్నారని అన్నారు. నల్ల ధనం తీసుకొస్తామని నీతులు చెప్పిన పార్టీ గత పదేండ్లుగా చేసిందేమి లేదని అన్నారు. గల్ఫ్ బాధితులను ఆదుకోవడానికి సీఎం రేవంత్‌రెడ్డి గల్ఫ్ పాలసీ, ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తున్నారని, గల్ఫ్ కుటుంబాలు కాంగ్రెస్‌ని ఆదరించి, పార్లమెంట్ ఎన్నికల్లో అత్యధిక మెజారిటీ ఇవ్వాలని కోరారు. పార్లమెంట్ అభ్యర్థి ఆత్రం సుగుణ మాట్లాడుతూ తన కుటుంబం పేదల కొరకు పాటు పడిన చరిత్ర ఉందని, సేవే ధ్యేయంగా కొనసాగుతామని ఒక అవకాశం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షులు శ్రీహరిరావు, మాజీ సహాయ కేంద్ర మంత్రి వేణుగోపాల చారి, మండల కాంగ్రెస్ అధ్యక్షులు వొద్నల రాజేశ్వర్, ఈటెల శ్రీనివాస్, అట్ల రాంరెడ్డి, అట్ల రవీందర్‌రెడ్డి, నరేష్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, చిన్న రాంరెడ్డి, బిట్లింగ్ నారాయణ, సమ్మెట రవి, నగేష్, రజని పాల్గొన్నారు.

సోషలిస్టు విప్లవ సాధకుడు లెనిన్

- ఘనంగా లెనిన్ జయంతి వేడుకలు



నవతెలంగాణ-నిర్మల్

సోషలిస్టు విప్లవ సాధకుడు లెనిన్ అని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు దుర్గం నూతన్ కుమార్ అన్నారు. సోమవారం ప్రజా సంఘాల కార్యాలయంలో లెనిన్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మానవులుగా పుట్టడం అనేది ఒక యాదృచ్ఛిక సంఘటన అని, జీవించడం మాత్రం యాదృచ్ఛికంగా ఉండకూడదన్నారు. ఒక లక్ష్యం కోసం తమ జీవితాలను త్యాగం చేసే వారే చరిత్రలో నిలిచిపోతారన్నారు. మత గ్రంథాల్లో, కాల్పనిక కథల్లో ఉండే ఊహల స్వర్గాన్ని సోషలిస్టు విప్లవం జయప్రదం చేయడం ద్వారా రష్యన్ ప్రజల కాళ్ల దగ్గరికి ఈడ్చుకొచ్చిన మహనీయుడు. విప్లవ సాధకుడు, మొదటి కార్మిక వర్గ రాజ్య స్థాపకుడు, ఆచరణ వాది లెనిన్ అని అన్నారు. లెనిన్ జీవితం ప్రపంచ మానవాళికి, ముఖ్యంగా కార్మికులకు, యువతరానికి ఆదర్శప్రాయమని అన్నారు. కార్యక్రమంలో సీపీఐ(ఎం) పట్టణ నాయకులు పోశెట్టి, నాయకులు రజిత, నాగెల్లి నర్సయ్య, నవీన్, సత్యం మజీద్, సాయిరెడ్డి పాల్గొన్నారు.

మోడీ పాలనలో అన్నివర్గాల ప్రజలకు ఇబ్బందులు

- సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ ఆవిర్భావ దినోత్సవం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

దేశంలో నరేంద్ర మోడీ పరిపాలనలో అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి.వెంకట నారాయణ అన్నారు. సోమవారం లెనిన్ జయంతి, సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ 55వ ఆవిర్భావ దినోత్సవాన్ని పట్టణంలోని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యాలయం కుమురంభీం భవన్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ శ్రమకు తగిన ఫలితం రావాలని, ప్రజల మౌలిక సమస్యల పరిష్కరించబడాలని, ఒక మనిషి మరొక మనిషి దోపిడీ చేయని వ్యవస్థ కావాలని న్యూడెమోక్రసీ పోరాడుతుందని తెలిపారు. లెనిన్ జన్మదినం పార్టీ పుట్టిన రోజుగా నిర్వహించుకుంటున్నామని, ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో పీఓడబ్ల్యూ జిల్లా కన్వీనర్ దుర్గం కళావతి, ఐఎఫ్టీయూ జిల్లా నాయకులు గౌరాల సుభాష్, ఏఐకేఎంఎస్ జిల్లా నాయకులు వామన్, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు ఎర్రజి హరీశ్, జిల్లా నాయకులు శ్రీశాంత్, శ్రీకర్ పాల్గొన్నారు.

కస్టమ్ మిల్లింగ్ రైస్ సరఫరాను వేగవంతంగా పూర్తిచేయాలి



నవతెలంగాణ-నిర్మల్

కస్టమ్స్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) సరఫరాను వేగవంతంగా పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో రెవెన్యూ, పౌర సరఫరాల శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. నిరంతరం మిల్లింగ్ ప్రక్రియ జరగాలని సూచించారు. నిర్లక్ష్యం వహించిన మిలర్లపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యవేక్షించాలని, మిల్లుల వారీగా మిల్లింగ్, ధాన్యం నిల్వలపై రిపోర్టులను అందజేయాలని ఆదేశించారు. అనంతరం మిలర్ల వారిగా లక్ష్యం, పూర్తిచేసిన సీఎంఆర్ సరఫరా, పెండింగ్‌పై చర్చించారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియ వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. వరి కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. తేమ శాతం 17లోపు ఉండాలన్నారు. కేంద్రాల వద్ద గన్ని బ్యాగ్స్, వెయిటింగ్ మిషన్లు, తేమ కొలిచే యంత్రాలు, టార్పలిన్లు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. ఇప్పటివరకు కొనుగోలు చేసిన ధాన్యం వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. కొనుగోలు కేంద్రాలపై ఫిర్యాదులు వస్తే కఠిన చర్యలు తప్పవని, మద్దతు ధరతో రైతుల నుంచి ధాన్యాన్ని కొనుగోలు చేయాలని ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, నిర్మల్, భైంసా, ఆర్డీఓలు రత్నాకళ్యాణి, కోమల్‌రెడ్డి, డీఆర్డీఓ విజయలక్ష్మి, డీఎస్ఓ నంధిత, డీఎం సివిల్ సప్లయ్ శ్రీకళ, డీసీఓ నర్సయ్య, డీఏఓ అంజి ప్రసాద్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో పలువురి చేరిక

నవతెలంగాణ-నేరడిగొండ

ఆదిలాబాద్ డైట్ కళాశాల మైదానంలో సోమవారం నిర్వహించిన సీఎం బహిరంగ సభలో మండలంలోని కుప్టి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు శ్రీరామోజి నారాయణ, కళ్లెం భోజన్న, ఆకుల వెంకటరమణ నియోజకవర్గ ఇన్‌చార్జి అడే గజేందర్, మండల అధ్యక్షుడు వసంత్‌రావు, ఏలేటి రాజారెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరారు. వీరికి కాంగ్రెస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.



తెలంగాణ వ్యాప్తంగా బెల్ట్ షాపులను రద్దు చేయాలి



నవతెలంగాణ-నిర్మల్

తెలంగాణ వ్యాప్తంగా బెల్ట్ షాపులను రద్దు చేయాలని ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కె.లక్ష్మి అన్నారు. సోమవారం సంఘం ఆధ్వర్యంలో ఎక్సైజ్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడారు. గతంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం బెల్ట్ షాపులకు పర్మిషన్లు ఇస్తే, ఇప్పుడున్న కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు మేము అధికారంలోకి వస్తే బెల్టు షాపులను రద్దు చేస్తామని హామీ ఇచ్చిందన్నారు. గెలిచిన తర్వాత ఇప్పటివరకు రద్దు చేయకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని మండిపడ్డారు. గ్రామాల్లో పేదలకు తాగడానికి మంచి నీళ్లు, పాఠశాలలు, ఆసుపత్రులు లేవు కానీ ప్రతి గ్రామంలో బెల్ట్ షాపులు ఉన్నాయని ఎద్దేవాచేశారు. ఈ బెల్ట్ షాప్‌ల వల్ల భార్యాభర్తల మధ్య గొడవలు అనునిత్యం జరుగుతూనే ఉన్నాయని, సంసారాలు కుటుంబాలు విచ్ఛిన్నం అవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం పేదల స్థితిగతులను ఆరోగ్య పరిస్థితులను పట్టించుకోవడంలేదని, పేదల జీవితాలతో చెలగాటమాడుతున్నారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలన్నారు. కార్యక్రమంలో పీఓడబ్ల్యూ జిల్లా నాయకులు జి. గంగామణి, లక్ష్మి, సీహెచ్ కవిత, తశ్రీన్, విజయలక్ష్మి, సునీత, మంజుల, రాధ పాల్గొన్నారు.

బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కును గెలిపించాలి

నవతెలంగాణ-ముధోల్

ఆదిలాబాద్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కును భారీ మెజారిటితో గెలిపంచాలని ముధోల్ నియోజకవర్గ బీఆర్ఎస్ సమన్వయ కమిటీ సభ్యులు లోలం శ్యాంసుందర్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులను ఇంటింటా వెళ్లి ప్రచారం చేస్తామని అన్నారు. ఏ కార్యకర్త అధైర్య పడవద్దని మీ వెంట మేమున్నామని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణలో ఆరు గ్యారంటీల పేరుతో అధికారంలోకి వచ్చినపూర్తిగా హామీల నెరవేర్చడం లేదని ఆరోపించారు. రుణమాఫీ సైతం నేటికీ చేయలేదని, వరికి బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యకర్తలంతా కంకణ బద్ధులై బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కును అధిక మెజారితో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ఎంపీటీసీ గంగాధర్, నాయకులు పెద్ద రాజేశ్వర్, శంకర్, విఠల్ పాల్గొన్నారు.

డ్రైవర్లు, క్లీనర్ల సమస్యలపై ఆర్టీసీ యాజమన్యం నిర్లక్ష్యం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

హైర్ బస్ డ్రైవర్లు, క్లీనర్ల సమస్యలపై ఆర్టీసీ యాజమన్యం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఎస్.విలాస్ ఆరోపించారు. సోమవారం హైర్ బస్ డ్రైవర్స్ అండ్ క్లీనర్స్ అసోసియేషన్ సభ్యులు సీపీఐ కార్యాలయంలో ఏఐటీయూసీలో చేరారు. వారికి సంఘం కండువా కప్పి ఆహ్వానించారు. అనంతరం ఐదుగురు సభ్యులతో కూడిన కమిటీని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఎస్.విలాస్ మాట్లాడుతూ ఆర్టీసీలో పని చేస్తున్న హైర్ బస్ డ్రైవర్లు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు. పని భారం పెరుగుతున్న అధికారులు, యాజమన్యం పట్టించుకోవడం లేదన్నారు. వేధింపులకు గురి చేస్తుందని ఆరోపించారు. సమస్యల పరిష్కరం కోసం ఏఐటీయూసీలో చేరారని, వారి హక్కుల కోసం ఉద్యమిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు దేవేందర్, రాజు, హైర్ బస్ డ్రైవర్స్ అండ్ క్లీనర్స్ నాయకులు సాయికుమార్, మంజూర్, నర్సింగ్, హబీబ్, ప్రీతంరెడ్డి, సతీష్, వెంకటేష్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో పలువురి చేరిక

నవతెలంగాణ-నార్నూర్

జిల్లా కేంద్రంలో మంత్రి సీతక్క సమక్షంలో ఆల్ ఇండియా బంజారా సేవ సంఘ్ మాజీ ప్రధాన కార్యదర్శి దివంగత బానోత్ జాలం సింగ్ కోడలు ప్రణీత సూరత్ సింగ్‌తో పాటు మండలంలోని పలువురు నాయకులు సోమవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ప్రజాపాలనలో రేవంత్‌రెడ్డి చేస్తునటువంటి సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను చూసి రాజకీయం కోసం పార్టీలో చేరినట్టు వారు తెలిపారు. దివంగత జాలం సింగ్ చేసిన అభివృద్ధిని కొనసాగిస్తామని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీ అభ్యర్థి సుగుణ, ఆసిఫాబాద్ డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాద్, ఆసిఫాబాద్ ఇన్‌చార్జ్ శ్యాంనాయక్, నార్నూర్ ఎంపీటీసీ కోలేట్కర్ పరమేశ్వర్, దత్తారాం ఉన్నారు.



ఎరువుల దుకాణాల్లో తనిఖీలు

నవతెలంగాణ-కౌటాల

మండల కేంద్రంలో సోమవారం వ్యవసాయ సహాయ సంచాలకులు జాటోత్ మనోహర్ ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. డీలర్లకు పలు సూచనలు చేస్తూ రికార్డులను పరిశీలించారు. కాలంచెల్లిన



ఎరువులను అమ్మరాదని, రికార్డులను సక్రమంగా నిర్వహించాలని సూచించారు. రైతులు ఎరువులు, విత్తనాలు కొనుగోళు చేసే సమయంలో తప్పని సరిగా రసీదు తీసుకోవాలన్నారు. రైతులను మోసం చేసిన, నకిలీ విత్తనాలు, ఎరువులు విక్రయించిన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయన వెంట మండల వ్యవసాయ అధికారి పాలకుర్తి రాజేష్ ఉన్నారు.

బీఆర్ఎస్‌లో చేరికలు

నవతెలంగాణ-పెంచికల్‌పేట్



మండలంలోని లోడ్‌పెల్లి గ్రామస్తులు ఎమ్మెల్సీ దండె విఠల్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా వారికి ఎమ్మెల్సీ విఠల్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. లోడ్‌పెల్లి గ్రామానికి చెందిన అలిశెట్టి రాజన్న, గంగన్న, నగేష్, వెంకటేశ్ పార్టీలో చేరారు. అనంతరం ఎమ్మెల్సీ దండె విఠల్ మాట్లాడుతూ పార్లమెంటు ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి ఆత్రం సక్కును గెలిపించేల ప్రతి కార్యకర్త కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు భిట్టు శ్రీనివాస్, సామల రాజన్న పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలపై నిరంతరం పోరాటం చేయాలి

- సింగరేణి వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు సీతారామయ్య



నవతెలంగాణ-రెబ్బెన

సింగరేణి సంస్థలో పని చేస్తున్న కార్మిక సమస్యలపై పోరాడాల్సిన బాధ్యత మనందరిపై ఉందని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు వి.సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి కే రాజకుమార్ అన్నారు. సోమవారం గోలేటి ఏరియాలోని ఆఫీసర్స్ క్లబ్‌లో గోలేటి బ్రాంచ్ కార్యదర్శి ఎస్.తిరుపతి అధ్యక్షతన ట్రేడ్ యూనియన్ శిక్షణ తరగతుల్లో ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడారు. సింగరేణికి నూతన బొగ్గు గనులపై యాజమాన్యంతో చర్చిస్తున్నట్లు తెలిపారు. గతంలో సింగరేణికే నేరుగా బొగ్గు గనులను కేటాయించారని, ప్రస్తుతం కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం బొగ్గు గనులను వేలం వేస్తామని ప్రకటించిందన్నారు. వేలంలో పాల్గొనేందుకు రాష్ట్ర ప్రభుత్వం సింగరేణికి అనుమతులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అదే విధంగా ఇప్పుడు గుర్తింపు సంఘంగా కార్మికుల పక్షాన నిలబడి సమస్యల పరిష్కారానికి కృషి చేయాల్సిన బాధ్యత తమపై ఉందన్నారు. గుర్తింపు సంఘంగా గెలిచినప్పటికీ ఆర్ఎల్‌సీ నుండి గుర్తింపు పత్రం సింగరేణి యాజమాన్యం ఇవ్వడం లేదని ఆరోపించారు. గత ఆర్థిక సంవత్సరంలో సంస్థ 70 మిలియన్ టన్నుల ఉత్పత్తి లక్ష్యం సాధించిన సందర్భంగా ఉద్యోగులకు ప్రోత్సాహకాలు అందించాలన్నారు. ప్రతి ఏటా ఇవాల్సిన పదోన్నతులను పార్లమెంట్ ఎన్నికల కోడ్ సాకుతో నిలిపివేయడం సరికాదన్నారు. ఈ శిక్షణా తరగతుల్లో ఏఐటీయూసీ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు ఎండి.యూసుఫ్, సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నరసింహారావు, రిటైర్డ్ సింగరేణి డీజీఎం పర్సనల్ శ్యామ్ సుందర్ రెడ్డి, గోలేటి బ్రాంచ్ ఉపాధ్యక్షులు బయ్య మొగిలి, గోలేటి బ్రాంచ్ ఆర్గనైజింగ్ కార్యదర్శులు బి జగ్గయ్య, చంద్రశేఖర్, జూపాక రాజేష్, జి.శివరావు. ఎస్.ఆనంద్, డి.రాజయ్య, కే.కిరణ్ బాబు, పిట్ కార్యదర్శులు ఎంబటి రామయ్య, కోడం అశోక్, రమేష్, యుగంధర్, నాయకులు సురేష్, కోరి సమీ, ఎల్తూరి శ్రీనివాస్, రాయిని రాజయ్య పుట్ట అంజయ్య పాల్గొన్నారు.

అడవి, వన్యప్రాణులను రక్షించాలి

- అటవీ సెక్షన్ అధికారి మహేందర్



నవతెలంగాణ-ఆసిఫాబాద్

అడవి, వన్యప్రాణులను రక్షించే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని అటవీ శాఖ సెక్షన్ అధికారి మహేందర్ అన్నారు. సోమవారం మొర్రిగూడ గ్రామంలో అడవుల రక్షణ-వన్య ప్రాణుల సంరక్షణ, అడవులతో మానవులకు ఉన్న సంబంధం అనే అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామస్తులు సమీప అడవిలో అటవీ హక్కు, పత్రాలతో వ్యవసాయం చేసే వారు హద్దులు చెదురకుండ చూడాలన్నారు. నిప్పు పడకుండా చూడాలని, అనవసరంగా ఇష్టానుసారం చెట్లు కొట్టవద్దని, పశువుల కాపలా దారులు పశువులను తమకు కేటాయించిన స్థలంలోనే మేపాలని సూచించారు. వంట చెరుకు బదులుగా గోబర్ గ్యాస్ వాడాలన్నారు. అడవిలో వన్యప్రాణులు కనపడిన, అగ్గి పడిన అధికారులకు తెలుపాలన్నారు. అడవులతో మానవుల మనుగడ ఉందని ప్రతి ఒకరు అడవులు వన్యప్రాణుల సంరక్షణకు కృషి చేయాలన్నారు. ఎవరైనా చెట్లు కొట్టిన, పొడు చేసిన వన్య ప్రాణులను వేటాడిన అటవీ సంరక్షణ చట్టం ప్రకారం చర్యలుంటాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీట్ అధికారులు సువర్ణ, రవీందర్, మోరిగూడ మాజీ సర్పంచ్ కుడ్మెత లచ్చు, గ్రామ పెద్దలు జంగు పటేల్, భగవంతరావు, గోపాల్, దౌలత్, లఘుపతి పాల్గొన్నారు.

స్పందించిన పోలీసులు



నవతెలంగాణ-జైపూర్

జైపూర్-భీమారం మండలాల మధ్యన జాతీయ రహదారిపై చెట్టు విగిరిగి రోడ్డుకు అడ్డంగా పడిపోయిందని విషయం తెలుసుకున్న భీమారం ఎస్సై రాములు స్పందించారు. వాహనాల రాకపోకలతో రద్దీగా ఉండే జాతీయ రహదారిపై చెట్టుపడిపోవడంతో వాహనాల అంతరాయం ఏర్పడకుండా జేసీబీ సహాయంతో పడిపోయిన చెట్టును తొలగించారు. వాహనాల రాకపోకలకు అంతరాయం కలుగకుండా తక్షణమే స్పందించిన పోలీసులకు వాహనదారులు కృతజ్ఞతలు తెలిపారు.

పాఠశాలల అభివృద్ధి పనులు పూర్తి చేయాలి

నవతెలంగాణ-జైపూర్

భీమారం మండల పరిధిలో గుర్తించిన అమ్మ ఆదర్శ పాఠశాలల అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపీడీఓ రాధా రాథోడ్ సూచించారు. సోమవారం మండల పరిధి ఎల్కేశ్వరం, ఆరేపల్లి, మద్దికల్, పోలంపల్లి గ్రామపంచాయతీల పాఠశాలను ఆమె సందర్శించారు. పాఠశాలల అభివృద్ధి పనులపై సంబంధిత పాఠశాలల హెచ్ఎం, మహిళా సంఘాల అధ్యక్షులకు పలు సూచనలు చేశారు. అదేవిధంగా పాఠశాలల్లో తాగునీటి వసతులను ఆర్అండ్‌బీ ఏఈ అనూష, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ విద్యాసాగర్‌తో కలిసి పరిశీలించారు.

అమ్మ ఆదర్శ పాఠశాలల పనులను పూర్తి చేయాలి

- కలెక్టర్ వెంకటేష్ దోత్రే



ఆసిఫాబాద్ : రాజూర మండలంలోని పాఠశాలలో వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలో అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి పనులను మే 31లోగా పూర్తి చేయాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అధికారులకు సూచించారు. సోమవారం ఆసిఫాబాద్ మండలం రాజూరా మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలను జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారితో కలిసి ఆకస్మిక తనిఖీ చేసి సహాయక ఇంజనీరింగ్ అధికారులు క్షేత్రస్థాయిలో తయారు చేసిన ప్రతిపాదనలలో పొందుపరిచిన అంశాలను పరిశీలించి ఇంజనీరింగ్ అధికారులతో వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ, స్థానిక సంస్థల పాఠశాలలలో అమ్మ ఆదర్శ పాఠశాల పథకంలో భాగంగా విద్యుదీకరణ, తాగునీరు, మరమ్మత్తుల పనులను చేపట్టడం జరుగుతుందని తెలిపారు. ఈ క్రమంలో వేసవి సెలవులలో జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలలో మౌలిక వసతుల కల్పన పై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. పాఠశాలలో చేపట్టాల్సిన అత్యవసర పనులకు ప్రాధాన్యతనిచ్చి ప్రతిపాదనలను రూపొందించాలని ఆదేశించారు. తాగునీటి కోసం పాఠశాలల్లో ఉన్న చేతిపంపులోనే మోటర్‌ను బిగించి బ్యాటరీ ఆఫ్ ట్యాప్స్ ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని, రూఫ్ లీకేజీని అరికట్టేందుకు కెమికల్ ట్రీట్మెంట్‌ను చేయాలన్నారు. విద్యుత్, మూత్రశాలల సౌకర్యాలు కల్పించినంతరం మిగులు నిధులను చిన్న తరహా మరమ్మత్తులకు వినియోగించాలని అధికారులకు సూచించారు. విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందే అన్ని ప్రభుత్వ పాఠశాలలలో కనీస వసతులు పూర్తిస్థాయిలో ఉండే విధంగా పనులను వేగవంతం చేయాలన్నారు. విద్యాశాఖ అధికారులు నిత్యం అభివృద్ధి పనులను పర్యవేక్షిస్తూ త్వరగా జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి పార్సి అశోక్, సెక్టోరల్ అధికారి భరత్ కుమార్, జిల్లా అదనపు గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి రామకృష్ణ, డిప్యూటి ఈఈ శ్రీనివాస్, సహాయ ఇంజనీర్ గిరీష్, మండల పరిషత్ అభివృద్ధి అధికారి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

వాంకిడి : మండలంలోని బోర్దా గ్రామంలో గల అమ్మ ఆదర్శ పాఠశాలను సోమవారం కలెక్టర్ వెంకటేష్ దోత్రె సందర్శించారు. పాఠశాలలో మరుగుదొడ్లు, నీటి సౌకర్యం, విద్యుత్ తదితర సమస్యలను ఉపాధ్యాయులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆదర్శ పాఠశాలలో సమస్యలను పరిష్కరించడానికే అమ్మ ఆదర్శ పాఠశాల కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. పాఠశాలలో మంచి వాతావరణం ఏర్పడే విధంగా అన్ని సౌకర్యాలు కల్పిస్తామన్నారు. పిల్లలకు తాగునీటి సమస్య లేకుండా చూడాలని సూచించారు. ఆయనతో పాటు అదనపు కలెక్టర్ దీపక్ తివారీ, ఎంఈఓ మణుకుమార్, అధికారులు, పాఠశాల, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.



వాంకిడి : ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

పోస్టల్ బ్యాలెట్ కోసం ఉద్యోగుల దరఖాస్తు

- నియోజకవర్గంలో 1500 మంది ఉద్యోగులు, వృద్ధులు, దివ్యాంగులు
- మే 3 నుంచి 8 వరకు ఓటింగ్



సిర్పూర్(టి)లోని పోలింగ్ కేంద్రం

నవతెలంగాణ-సిర్పూర్(టి)

మే 13న జరగనున్న పార్లమెంట్ ఎన్నికల్లో పోస్టల్ బ్యాలెట్ ఓటు వేసేందుకు ఎన్నికల కమిషన్(ఈసీ) అనుమతి ఇచ్చింది. సిర్పూర్ నియోజకవర్గంలో 29 పాత పోలింగ్ కేంద్రాలు, కొత్త నాలుగు పోలింగ్ కేంద్రాలు ఇటుకలపహాడ్, టోంకిని, కేశవపట్నం, పూసుగూడ పోలింగ్ కేంద్రాల్లో సుమారు 132 మంది ఉద్యోగులు, ఆరుగురు సెక్టోరియల్ అధికారులు విధులు నిర్వహించనున్నారు. దాదాపు 1500 మంది పోస్టల్ బ్యాలెట్ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. వీరు తమ ఓటును సద్వినియోగం చేసుకొనేందుకు వీలుగా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. పోస్టల్ బ్యాలెట్ కోసం గతంలో ఉద్యోగులు సొంతగా దరఖాస్తు చేసుకొనే వారు కొంత మందికి అవగాహన లేక దరఖాస్తు చేసుకొనే వారు కాదు. ఈ ఎన్నికల్లో శిక్షణ ఉత్తర్వులతో పాటు ఫారం 12లో ఉద్యోగులకు సంబంధించిన ఓటు వివరాలను ముద్రించి ఇచ్చారు. శిక్షణకు వెళ్లిన సమయంలో ఆర్డర్ కాపీతో పాటు ఫారం నెంబర్ 12 ఓటరు గుర్తింపు కార్డు జిరాక్స్ కాపీని జతచేసి ఎక్కడ ఓటు వేస్తారనే విషయాన్ని మొదటిదశ శిక్షణ సమయంలోనే తెలియజేశారు. ఉద్యోగులకు సంబంధించిన పోస్టల్ బ్యాలెట్ విషయంలో అసెంబ్లీ ఎన్నికల్లో గందరగోళం ఏర్పడింది. శిక్షణ కేంద్రంలోనే ఓటు వేసేందుకు అవకాశం కల్పించిన చాలామంది పేర్లు జాబితాలో లేకపోవడంతో బ్యాలెట్ అందలేదు. అలాంటి వారికి తిరిగి రిటర్నింగ్ కేంద్రంలోకి వెళ్లి ఓటు వేసేందుకు అవకాశం ఇచ్చారు. సరైన సమాచారం లేక ఓటును వినియోగించుకోలేకపోయారు. పోస్టల్ బ్యాలెట్ కోసం దరఖాస్తు చేసుకున్న ఫెసిలిటేశన్ కేంద్రాలు ఎక్కడ ఉన్నాయని, ఓటు ఎక్కడ వేయాలనే దానిపై స్పష్టత లేకుండా పోయింది. ఇతర జిల్లాలకు చెందిన పోస్టల్ బ్యాలెట్‌లు అందడంలో జాప్యం జరిగింది. వీటన్నింటినీ దృష్టిలో ఉంచుకొని పార్లమెంటు ఎన్నికల్లో ప్రతి ఉద్యోగి తన ఓటు హక్కును వినియోగించుకొనేల ఎన్నికల సంఘం చర్యలు చేపట్టింది. దాదాపు 90 శాతం మంది ఉద్యోగులు తొలిదశ శిక్షణ సమయంలోనే ఫారం నెంబర్ 12ను సమర్పించారు. అత్యవసర సేవల విభాగాలైన విద్యుత్, వైద్యం, రవాణ, పోలీసు, అగ్నిమాపక, రైల్వే తదితర శాఖలో పనిచేసే ఉద్యోగుల పోస్టల్ బ్యాలెట్ కోసం ఇచ్చిన గడువు ఈ నెల 15తో ముగిసింది. ఉద్యోగులు తాము పనిచేసే నియోజకవర్గంలో ఓటు వేసేందుకు ఆప్షన్ ఇస్తే ఓటు వేయడానికి వీలుగా ఒకరోజు సెలవు మంజూరు చేస్తారు. పనిచేసే చోటనే ఓటు వేయాలనుకుంటే స్థానికంగా ఏర్పాటు చేసిన ఫెసిలిటేశన్ కేంద్రాల్లో లేదా నియోజకవర్గంలోని అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి కేంద్రంలోనూ ఓటు వేసేందుకు వీలుంటుంది. మే మూడు నుండి ఎనిమిదవ తేదీలోగా పోస్టల్ బ్యాలెట్‌ను పూర్తిచేసేల ఏర్పాట్లు చేస్తున్నారు. మొదటిదశ శిక్షణలో ఫారం 12 సమర్పించిన ఉద్యోగులు రెండవ దశలో వారికి కేటాయించిన అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రాల్లో నిర్వహించే మలివిడత శిక్షణ సమయంలో పోస్టల్ బ్యాలెట్‌ను సమర్పించనున్నారు. అత్యవసర విభాగాల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు సైతం మే మూడు నుండి ఓటుకు అవకాశం ఇవ్వనున్నారు. పోస్టల్ బ్యాలెట్ కోసం వినియోగించే బ్యాలెట్ పత్రాలను జిల్లాలోనే ముద్రించుకోవాలని ఎన్నికల సంఘం ఇప్పటికే స్పష్టం చేయగా ఆ మేరకు అధికారులు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. ఇక ఇంటి నుంచే ఓటు వేసే దివ్యాంగులు, వృద్ధులు ఫారం 12(డి) రిటర్నింగ్ అధికారికి అందించాల్సి ఉంది. ఇంటి వద్ద నుండి ఓటు హక్కును వినియోగించుకోనేందుకు దరఖాస్తు సమర్పించిన దివ్యాంగులు, 85 ఏండ్ల పైబడిన వృద్ధుల నుండి సైం మే మూడు నుండి ఓట్లు స్వీకరించనున్నారు.య వీరు కూడా మే 3 నుంచి ఓటు వేయవచ్చు.

రోగులకు నాణ్యమైన వైద్య సేవలందించాలి

- కలెక్టర్ వెంకటేష్ దోత్రే

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా ఆస్పత్రికి వచ్చే రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. జిల్లా ఆస్పత్రిని సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలోని రికార్డులను పరిశీలించి ఆస్పత్రి ఆవరణలో పరిశుభ్రత, అందుతున్న సేవల గురించి రోగులతో మాట్లాడి తెలుసుకున్నారు. ఆ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆస్పత్రికి వచ్చే రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలన్నారు. జిల్లాలోని ఇతర ఆస్పత్రులతో పోల్చితే జిల్లా ఆస్పత్రి పూర్తిగా శుభ్రంగా ఉండాలన్నారు. అధికారులు ఎప్పటికప్పుడు శుభ్రతపై దృష్టి కేంద్రీకరించాలని ఆదేశించారు. వేసవి కాలంలో ఎండలు ఎక్కువగా ఉన్న నేపథ్యంలో ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలన్నారు. వేసవి కాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై, ఆస్పత్రిలో అందుతున్న వైద్యం గురించి ఏఎన్ఎంలు ఇతర సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఉపాధి హామీ కూలీలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయాలన్నారు. ఆస్పత్రిలో నిర్మాణంలో ఉన్న అదనపు గదుల పనులు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఆస్పత్రిలో నిర్వహించే ఏ రికార్డు కూడా పెండింగ్‌లో ఉండకూడదన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి తుకారం భట్, మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ నాగార్జున చారి, ఆస్పత్రి సూపరిండెంట్ చెన్నకేశవులు, ఇతర వైద్యులు సిబ్బంది పాల్గొన్నారు.



వైద్యులతో మాట్లాడుతూ వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

విరిగిన స్తంభాలు, నేలకొరిగిన చెట్లు



నవతెలంగాణ-కౌటాల

మండలంలో కురిసిన భారీ వర్షానికి వడగళ్ల గాలులు రావడంతో ముత్తంపేట్, మొగడ్‌దగడ్, గుండాయిపేట్ గ్రామాల్లో కరెంటు స్తంభాలు విరిగాయి. మొగడ్‌దగడ్ గ్రామంలో హనుమాన్ మందిర్ వద్ద చెట్లు విరిగి రోడ్డుకు అడ్డంగా పడడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. సోమవారం ఉదయం నుండి సాయంత్రం వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఉక్కపోతతో ఇబ్బందులు పడ్డారు. ముత్తంపేట్ గ్రామంలో ఇంటి రేకులు మొత్తం లేచిపోవడంతో ఇంటిలోని వస్తువులన్నీ వర్షానికి తడిసి ముద్దయ్యాయి.



పనులు చేపట్టరా..?

- పట్టించుకోని ప్రజా ప్రతినిధులు
- ఇబ్బందుల్లో వాహనదారులు



నవతెలంగాణ-సిర్పూర్(టి)

ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై కథనాలు వస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకోవడం లేదు. ఈ నెల 8వ తేదీన నవతెలంగాణ దినపత్రికలో ప్రచురితమైన తూతూమంత్రంగా రోడ్డు పనులు అనే కథనానికి ఇప్పటి వరకు ప్రజా ప్రతినిధులు, అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. నియోజకవర్గకేంద్రమైన సిర్పూర్(టి)లో రహదారుల పరిస్థితి అధ్వానంగా ఉంది. మూడు నెలల క్రితం బస్టాండు నుండి రైల్వేస్టేషన్‌కు వెళ్లే రోడ్డు మార్గంలో జెడ్పీఎస్ పాఠశాల నుండి ఇడెన్ గార్డన్ పాఠశాల వరకు సుమారు వంద మీటర్ల రోడ్డు మరమ్మత్తు పనులు ఆర్అండ్‌బీ అధికారులు ప్రారంభించారు. దీనిపై నవతెలంగాణ కథనం రాసినప్పుడు అధికారులు, సదరు కాంట్రాక్టర్ తూతూమంత్రంగా స్పందించి కంకర వేశారు. ఈ మార్గం గుండా రైల్వేస్టేషన్ వరకు ప్రయాణికులు నిత్యం ఆటో, ద్విచక్ర వాహనాలపై వెళ్తుంటారు. అదేవిధంగా ఈ మార్గం గుండా మహారాష్ట్ర, రాజస్థాన్, గుజరాత్, ఛత్తీస్‌ఘడ్, ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రాలకు నిత్యావసర వస్తువులతో భారీ వాహనాలు పోతుంటాయి. రోడ్డు మరమ్మత్తు పనులు అసంపూర్తిగా ఉండడంతో ఈ మార్గానికి ఇరువైపుల పాఠశాల విద్యార్థులు, సాధారణ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. నియోజకవర్గ కేంద్రమైన సిర్పూర్ పరిస్థితి ఇంత అధ్వానంగా ఉంటే మారుమూల పల్లెల పరిస్థితి ఏ విధంగా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. ఈ మార్గం గుండానే అధికారులు, ప్రజా ప్రతినిధులు, ప్రస్తుతం జరుగుతున్న పార్లమెంటు ఎన్నికల ప్రచారం నిమిత్తం అభ్యర్థులు, కార్యకర్తలు వెళ్తున్నారు. ఈ రోడ్డును పట్టిపట్టనట్టుగా వ్యవహరిస్తున్నారే తప్పా దీని పనులు పూర్తి చేయడంలో మాత్రం శ్రద్ధ వహించడంలేదనే ఆరోపణలున్నాయి. ప్రజా ప్రతినిధులకు ఎన్నికలపై ఉన్న శ్రద్ధ సమస్యలు పరిష్కరించడంలో కనబడడంలేదని, కేవలం తమ అధికారం కోసం ఊరూరు తిరుగుతున్నారే తప్పా ఆయా గ్రామాల్లో ఉన్న సమస్యలను మాత్రం పట్టించుకోవడంలేదని జనాలు మండిపడుతున్నారు. ఇప్పటికైనా ప్రజా ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు స్పందించి అసంపూర్తిగా ఉన్న రోడ్డు పనులను పూర్తిచేయాలని కోరుతున్నారు.

రైలు కింద పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి

నవతెలంగాణ-కాగజ్‌నగర్

కాగజ్‌నగర్-వేంపల్లి రైల్వే స్టేషన్‌ల మధ్య రైలు కింద పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు జీఆర్‌పీ హెడ్ కానిస్టేబుల్ సురేష్ గౌడ్ తెలిపారు. మృతుడు సుమారు 30 నుండి 35 సంవత్సరాల వయస్సు కలిగి ఉన్నాడని, మంచిర్యాల నుండి బల్లార్షా వైపు వెళ్లే గుర్తు తెలియని రైలు కింద పడి మృతి చెందినట్లు తెలిపారు. సన్నని డబ్బాలు కలిగిన షర్టు, బ్లాక్ పాయింట్ ధరించి ఉన్నాడని, మృతదేహాన్ని సిర్పూరు (టి) ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు 8712658596, 8712658605, 9948481902 నెంబర్‌లలో సంప్రదించాలని సూచించారు.

కొనసాగుతున్న హనుమాన్ జయంతి వేడుకలు



నవతెలంగాణ-ఆసిఫాబాద్

పట్టణంలోని జన్కపూర్‌లో గల వీరంజనేయ స్వామి ఆలయంలో హనుమాన్ జయంతి ముందురోజు జయంతి ఆనవాయితీగా జరుపుతున్న హనుమాన్ జయంతి వేడుకలను ఆలయ ప్రధాన అర్చకులు మసాదే రామచందర్(బండు) ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. స్వామివారికి సుప్రభాత సేవ, కలశ, గణపతి పూజ, ధ్వజారోహణం, నవగ్రహ స్థాపన, పూజ సహస్ర తమలాపత్ర, సహస్ర ఫల పుష్పర్చన, మంగళ హారతి మహా మంత్రం, పుష్పం తీర్థ ప్రసాద వితరణ, మహా ప్రసాదం(అన్నదాన) కార్యక్రమలను నిర్వహించారు. హనుమాన్ భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

నేటి నుంచి పాఠశాలకు సెలవులు

నవతెలంగాణ-కౌటాల

2023-24 సంవత్సరానికి సంబంధించిన వార్షికం మంగళవారంతో ముగుస్తుంది. సోమవారంతో వార్షిక పరీక్షలు పూర్తికావడం వల్ల మండల కేంద్రంతో పాటు ఆయా పాఠశాలల్లో విద్యార్థులు సాంస్కృతిక నృత్యాలు చేసి ముగించుకున్నారు. ఉపాధ్యాయులు కూడా విద్యార్థులకు జత కలిసి ఉత్సహం నింపారు.

24న ఎక్సైజ్ కార్యాలయంలో వాహనాల వేలం

నవతెలంగాణ-కాగజ్‌నగర్

ఈ నెల 24న కాగజ్‌నగర్ పట్టణంలోని ఎక్సైజ్ కార్యాలయంలో వాహనాల వేలం నిర్వహించనున్నట్లు ఎక్సైజ్ సీఐ పి.సామ్యూల్ జాన్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వివిధ కేసులలో అక్రమ రవాణాలో పట్టుబడ్డ వాహనాలకు ఉదయం 11 గంటలకు వేలం పాట నిర్వహించనున్నట్లు తెలిపారు. పూర్తి వివరాలకు కాగజ్‌నగర్ ఎక్సైజ్ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

కన్యకా పరమేశ్వరి విగ్రహ పూజలు

నవతెలంగాణ-జైపూర్

మండలంలోని కుందారం గ్రామానికి చెందిన వైశ్య కుటుంబాల మహిళలు ఐదు రోజులుగా కన్యకా పరమేశ్వరి విగ్రహనికి పూజలు నిర్వహిస్తున్నారు. వైశ్య పీఠాదిపతి శ్రీనివాసులు వద్దన గల కన్యకా పరమేశ్వరి పీఠాన్ని ప్రతి గ్రామంలో పెట్టి పూజలు నిర్వహిస్తుంటారని గ్రామస్తులు తెలిపారు. ఐదు రోజుల పాటు నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమం ద్వార సోమవారం పీఠాన్ని కదలించినట్లు వివరించారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మంచిర్యాల
మంగళవారం | ఏప్రిల్ 23, 2024 | www.navatelangana.com

ప్రీమియర్ లీగ్ విజేతలకు బహుమతుల అందజేత

నవతెలంగాణ-మందమర్రి



ఐపీఎల్ తరహాలో గురూస్ క్రికెట్ అకాడమీ ఆధ్వర్యంలో 8 ఫ్రాంచైజీలలో 170 మంది క్రీడాకారులను వేలం పాట ద్వారా ఎంపిక చేసి పది రోజులుగా మంచిర్యాల మున్సిపల్ గ్రౌండ్‌లో టోర్నమెంట్ నిర్వహించారు. సోమవారం సీఎస్కె వర్సెస్ ఆర్సిబి టీమ్‌కి ఫైనల్ మ్యాచ్ జరిగింది. విజేతలకు రూ.1లక్ష అంజనీపుత్ర యజమాని గుర్రాల శ్రీధర్, పిల్లి రవి, రావుల ఉప్పలయ్య బహుకరించగా, రన్నర్స్ కు తవక్కల్ విద్యాసంస్థల యజమాని అబ్దుల్ అజీజ్ రూ.50 వేల బహుమతి ప్రధానం చేసారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కాంగ్రెస్ మంచిర్యాల టౌన్ ప్రెసిడెంట్ తూముల నరేష్, 9వ వార్డు కౌన్సిలర్ బోలిశెట్టి కిషన్, తూముల ప్రభాకర్, ఎంపిఎల్ ఆర్గనైజర్స్ బింగి దుర్గాప్రసాద్, బింగి శివకిరణ్, వైద్య ప్రశాంత్, శ్రీను, సతీష్, రాకేశ్ పాల్గొన్నారు.

మావోయిస్టుల సమాచారం ఇస్తే నగదు పారితోషికం

నవతెలంగాణ-జైపూర్

మావోయిస్టులకు సంబంధించిన సమాచారం అందించిన వారికి నగదు పారితోషికం ఇవ్వనున్నట్లు రామగుండం పోలీస్ కమీషనర్ శ్రీనివాస్ స్పష్టం చేశారు. పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాలకు చెందిన పోలీస్ అధికారులతో కలిసి మావోయిస్టుల వివరాలతో కూడిన కర పత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మావోయిస్టులకు సహకరించవద్దని విజ్ఞప్తి చేసిన ఆయన వారికి సంబంధించిన సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు. అజ్ఞాతంలో ఉన్నటువంటి మావోయిస్టు సోదరులు పోరాటం చేయాల్సింది అడివిలో కాకుండా ప్రజాక్షేత్రంలో సమస్యలపై చట్ట బద్దంగా పోరాడాలని సూచించారు. ప్రజలచే ఎన్నుకోబడి చట్ట సభల్లోకి ఎన్నికై పోలీసుల గౌరవ వందనం పొందాలని సీపీ శ్రీనివాస్ అన్నారు. మావోయిస్టులకు సంబంధించిన సమాచారం అందించాలనుకున్న వారు 08728-271333 సీపీ రామగుండం, 8712656502 డీసీపీ మంచిర్యాల, 8712656503 ఎస్‌బీ, 8712656596 నంబర్లకు సమాచారం అందివ్వాలని విజ్ఞప్తి చేశారు.

ఘనంగా ప్రజాసేవ వెల్ఫేర్ సొసైటీ ఆవిర్భావ దినోత్సవం



నవతెలంగాణ-మందమర్రి

ప్రజాసేవ వెల్ఫేర్ సొసైటీ 5వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను సోమవారం మందమర్రిలో ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి మిఠాయిలు పంచిపెట్టారు. ముఖ్య అతిథిగా హాజరైన మందమర్రి సీఐ శశిధర్‌రెడ్డి చేతుల మీదుగా టీషర్ట్స్ ను ఆవిష్కరించారు. అనంతరం సీఐ శశిధర్‌రెడ్డి మాట్లాడుతూ ఈ రోజుల్లో యువత చెడు మార్గంలో వెళ్తున్న తరుణంలో ఆ మార్గాన్ని ఎంచుకోకుండా సేవ మార్గం ఎంచుకొని జిల్లాలో యువతకు ఆదర్శంగా నిలువడం అభినందనీయమని కొనియాడారు. వ్యవస్థాపధ్యక్షుడు షేక్ అజీమోద్దీన్, ఉపాధ్యక్షుడు సుద్దాల ప్రభు దేవ్ మాట్లాడుతూ ఐదు సంవత్సరాలుగా సహకరించి మా కోసం ముందుండి నడిపిన వ్యక్తులకు ఏల్పుల కిరణ్, చోటు భాయ్‌లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపి వారికి సన్మానం చేశారు. ఇద్దరు వ్యక్తులతో మొదలై ఈ రోజు వందల మందితో ముందుకు వెళుతుందని అన్నారు. కరోనా సమయంలో పౌష్టిక ఆహారం అందించామని, మృతి చెందిన వారికి దహన సంస్కారాలు నిర్వహించామని, లాక్ డౌన్ సమయంలో పేదలకు నిత్యవసర వస్తువులు, విద్యార్థులకు పుస్తకాలు అందించినట్లు, చలివేంద్రాలు ఏర్పాటు చేసామని తెలిపారు. గుంతలు ఏర్పడిన రోడ్లను మరమ్మతులు చేసినట్లు, రోడ్డు మార్గంలో ఇబ్బందిగా మారిన చెట్లను తొలగించినట్లు గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు రాజు, జిల్లా కార్యదర్శి గాండ్ల సంజీవ్, జావిద్ పాషా, గోపాల్, అన్వేష్ పాల్గొన్నారు.

ఓటు హక్కును తప్పక వినియోగించుకోవాలి

- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బదావత్ సంతోష్



నవతెలంగాణ-నస్పూర్

లోక్‌సభ ఎన్నికలలో భాగంగా మే 13వ తేదీన నిర్వహించే పోలింగ్‌లో తప్పక ఓటు హక్కును వినియోగించుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. సోమవారం కలెక్టర్ కార్యాలయ ఆవరణలో ఓటరు సెల్ఫీ బోర్డులను జిల్లా అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి కిషన్, సహాయ కార్మికశాఖ కమీషనర్ వినీతలతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాజ్యాంగం భారత పౌరులకు కల్పించిన ఓటు హక్కు వజ్రాయుధమని, ఎలాంటి తేడాలు లేకుండా ప్రతి ఒక్కరికి సమాన హక్కు కల్పించడం జరిగిందని తెలిపారు. దేశాభివృద్ధికి పాటు పడే సమర్థవంతమైన నాయకత్వాన్ని ఎన్నుకునే అవకాశం ఓటు హక్కు ద్వారా మాత్రమే ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమశాఖ అధికారి కె.చిన్నయ్య, స్వీప్ సమన్వయకర్త రాంచందర్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ఎన్నికల అధికారులు సమన్వయంతో పని చేయాలి

లోక్‌సభ ఎన్నికల నిర్వాహణలో విధులు నిర్వహిస్తు ఎన్నికల అధికారులు సమన్వయంతో పని చేయాలని కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమీకత కంట్రోల్ రూమ్, సి-విజిల్, వీడియో పరిశీలన, మీడియా సర్టిఫికేషన్ మానిటరింగ్ కమిటీ, మీడియా సెంటర్లను, రికార్డులు, రిజిస్టర్లను పరిశీలించారు. పత్రికలు, ఈ-పేపర్లు, టెలివిజన్ ఛానెల్లు, స్థానిక కేబుల్ నెట్వర్క్, సోషల్ మీడియా, ఎస్ఎంఎస్‌లు, ఇతర ఆడియో, వీడియో విజువల్ మీడియాలతో సహా ప్రకటనలను ఎంసిఎంసీ నుండి ముందస్తు అనుమతి పొందిన తర్వాత మాత్రమే విడుదల చేయాలని తెలిపారు. ఎన్నికల సంబంధిత ఫిర్యాదులకు కంట్రోల్ రూమ్‌తో పాటు సి- విజిల్, టోల్ ఫ్రీ నెంబర్ 1950ను ఏర్పాటు చేయడం జరిగిందని, 24 గంటలు అందుబాటులో ఉంటుందని, సి-విజిల్ ద్వారా ఎన్నికల నిబంధనల ఉల్లంఘన, ఇతర ఫిర్యాదులను 100 నిమిషాల వ్యవధిలోగా పరిష్కరించడం జరుగుతుందని తెలిపారు. ప్రత్యేక బందాల ద్వారా తనిఖీలు, ప్రచార కార్యక్రమాల రికార్డులను పరిశీలించి తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

స్ట్రాంగ్ రూమ్లు వద్ద గట్టి బందోబస్తు

స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపరిచిన ఈవీఎంల రక్షణ దిశగా బందోబస్తు నిర్వహించాలని కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్ భద్రతా ఏర్పాట్లను రామగుండం కమీషనర్ ఆఫ్ పోలీస్ శ్రీనివాస్‌తో కలిసి పరిశీలించారు. అనంతరం స్థానిక ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రంలో ఏర్పాట్లను పరిశీలించారు.



చెక్‌పోస్టులో పకడ్బందీగా తనిఖీలు చేపట్టాలి



నవతెలంగాణ-జైపూర్

పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా కోటపల్లి మండలం రాపన్‌పల్లి అంతరాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్టుల వద్ద విధులు నిర్వర్తిస్తున్న పోలీస్ అధికారుల రాంత్రింబవళ్లు పకడ్బందీ తనిఖీ చేపట్టాలని రామగుండం పోలీస్ కమీషనర్ శ్రీనివాస్ సూచించారు. సోమవారం కలెక్టర్ బాదావత్ సంతోష్‌తో కలిసి అంతరాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్టులతో పాటు కిష్టంపేటలో గల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూములను పరిశీలించారు. చెక్‌పోస్టు విధుల్లో ఉన్న వారు రహదారి మీదుగా వచ్చిపోవు వాహణాలను క్షుణ్ణంగా తనిఖీ చేయాలని, బస్సులు ద్విచక్ర వాహనాలను సైతం వదలకుండా తనిఖీ చేయాలని తెలిపారు. విధుల్లో గల అధికారులు జాగ్రత్తలు పాటించాలని, రాత్రి సమయంలో రేడియం జాకెట్స్ ఉపయోగించాలని అక్రమంగా డబ్బు, మద్యం బంగారం విలువైన వస్తువులు తరలిస్తుంటే పట్టుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల డీసీపీ అశోక్ కుమార్, మంచిర్యాల ఏసీపీ ప్రకాష్, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ రాఘవేంద్ర రావు, శ్రీరాంపూర్ సీఐ మోహన్, చెన్నూర్ టౌన్ ఇన్స్‌పెక్టర్ రవీందర్, కోటపల్లి, భీమారం ఎస్సైలు రాజేందర్, రాములు ఉన్నారు.

ఫేక్ ఫింగర్ ప్రింట్స్ నిర్వాహకుల అరెస్ట్

- వివరాలు వెల్లడించిన రామగుండం సీపీ శ్రీనివాస్



నవతెలంగాణ-జైపూర్

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రధాన మంత్రి కౌశల్య కేంద్ర్ (పీఎంకేకే) పథకంకు సంబంధించి ఫేక్ ఫింగర్ ప్రింట్స్ సృష్టించి అవకతవకలకు పాల్పడిన అల్టిమేట్ ఎనర్జీ రిసోర్స్ ప్రయివేట్ లిమిటెడ్ సంస్థ నిర్వాహకులను అరెస్ట్ చేసినట్లు రామగుండం సీపీ శ్రీనివాస్ తెలిపారు. సోమవారం రామగుండం పోలీస్ కమీషనర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో నిందితుల వివరాలు వెల్లడించారు. హైదరాబాద్‌కు చెందిన మల్లిఖార్జున్, నర్సంపేట్‌కు చెందిన సలీం జాఫర్, వెంకటేష్, మంచిర్యాలకు చెందిన దేవేందర్‌లు నిందుతుల్లో ఉన్నట్లు తెలిపారు. ఫేక్ ఫింగర్ ప్రింట్స్ ద్వార అవకతవకలకు పాల్పడుతున్నట్లు గుర్తించి నిందితుల నుండి ఫేక్ ఫింగర్ ప్రింట్ తయారీ మెటేరియల్, అభ్యర్థుల అటెండెన్స్ రిజిస్టర్, డాక్యుమెంట్, ల్యాప్ టాప్, బయో మెట్రిక్ మిషన్‌లు స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టి ప్రధాన మంత్రి కౌశల్య కేంద్ర్ పథకం ద్వార దేశంలోని నిరుద్యోగ యవతకు ఉపాధి కల్పించడం కోసం స్కిల్ డెవలప్‌మెంట్ విషయమై ఉచితంగా పలు కోర్సులు అందిస్తుంది. ఇట్టి పథకంను ప్రభుత్వం భోపాల్, కేంద్రంగా నిర్వహించబడుతున్న అల్టిమేట్ ఎనర్జీ రిసోర్స్ ప్రయివేట్ లిమిటెడ్ సంస్థ ద్వారా దేశంలోని నిరుద్యోగ యువకులకు స్కిల్ డెవలప్‌మెంట్ కోసం సదరు సంస్థకు బాధ్యతలు అప్పగించింది. రాష్ట్రానికి సంబందించిన ప్రధాన కార్యలయం హైదరాబాద్ కేంద్రంగా కొనసాగుతోంది. భోపాల్‌లో ప్రధాన కార్యాలయం ఆర్గనైజర్‌గా సాహిల్ వలి, హైదరాబాద్‌కు సంబందించి మధురానగర్‌లో గల ప్రధాన కార్యాలయం ఇన్‌చార్జిగా అవునూరి శ్రీనివాస్ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. హైదరాబాద్ ప్రధాన కేంద్రంగా మంచిర్యాల, హుజూర్‌నగర్, జనగామలో స్కిల్ డెవలప్‌మెంట్ కార్యాలయాలు పని చేస్తున్నాయి. మంచిర్యాల కార్యాలయం ఆర్గనైజర్‌గా నాగర్‌కర్నూల్ జిల్లాకు చెందిన మల్లిఖార్జున్ అనే వ్యక్తి పని చేస్తున్నాడు. గత 2020 నుంచి ఏడాదికి 320 మందికి చొప్పున ఆయా కేంద్రాల్లో నిరుద్యోగ యువకులకు స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణ ఇస్తున్నారు. ఈ శిక్షణ ఇచ్చినందుకు కేంద్ర ప్రభుత్వం ఒక్కొక్కరికి రూ.13 వేల చొప్పున నిధులు మంజూరు చేస్తోంది. మంచిర్యాల సెంటర్‌లో ఈ సంవత్సరం 300 మంది ఫేక్ ఫిగర్‌ప్రింట్ నమోదు చేసి కేవలం 50 మందికి మాత్రమే శిక్షణ ఇస్తూ కేంద్ర ప్రభుత్వాన్ని మోసం చేస్తున్నారని సీపీ తెలిపారు.



సెక్యూరిటీ గార్డులకు ఓఆర్ఎస్, మజ్జిగ పంపిణీ చేయాలి

- ఎస్‌సీకేఎస్(సీఐటీయూ) రాష్ట్ర అధ్యక్షుడు దూలం శ్రీనివాస్



నవతెలంగాణ-మందమర్రి

ఎస్ అండ్ పీసీ ప్రయివేటు సెక్యూరిటీ గార్డులకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు, మజ్జిగ ప్యాకెట్లు అందించాలని, చెక్‌పోస్ట్‌ల వద్ద మంచినీటి సౌకర్యం కల్పించాలని సింగరేణి కాంట్రాక్ట్ కార్మిక సంఘం(సీఐటీయూ) రాష్ట్ర అధ్యక్షుడు దూలం శ్రీనివాస్ డిమాండ్ చేశారు. సోమవారం సెక్యూరిటీ గార్డుల పరేడ్ అనంతరం నిర్వహించిన సమావేశం సమావేశం నిర్వహించారు. సెక్యూరిటీ గార్డులకు ఎండల తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో సింగరేణి యాజమాన్యం కార్మికులు డిహైడ్రేషన్ బారినపడి వడదెబ్బ తగలకుండా తాగడానికి మంచినీటి సౌకర్యం కల్పించాలన్నారు. ఉత్పత్తిలో, లాభాలలో ఎస్ అండ్ పిసి కార్మికుల శ్రమ కూడా ఉందని యాజమాన్యం గుర్తించాలన్నారు. ఉత్పత్తి, లక్ష్యాన్ని చేధించి వేలకోట్ల లాభాలు సాధించడంలో ప్రతి ఒక్క కార్మికుడు కీలక పాత్ర పోషిస్తున్న కార్మికుల అవసరాల రీత్యా ఇవ్వాల్సిన కనీస సౌకర్యాలు కల్పించడంలో యాజమాన్యం విఫలం అయ్యిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ అండ్ పీసీ ప్రయివేటు సెక్యూరిటీ గార్డులు పాల్గొన్నారు.

నేడు కైతల ఎన్నీలకు ఆహ్వానం

నవతెలంగాణ-నస్పూర్

ఏప్రిల్ 23 మంగళవారం సాయంత్రం 6 గంటలకు తెలంగాణ రచయితల వేదిక ఆధ్వర్యంలో మంచిర్యాల పట్టణం గౌతమినగర్ లోని పాయిలి మల్లయ్య ఇంటి వద్ద కైతల ఎన్నీల నిర్వహించనున్నట్టు జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు తోకల రాజేశం, నాగవర్మ ముత్యంలు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ముందుగా జిల్లాకు చెందిన కవి లేదాళ్ల రాజేశ్వర రావు రాసిన 'అమ్మకు ఓ జత చెప్పులు కొనాలి' కవితా సంపుటి పరిచయం ఉంటుందని, అనంతరం కవి సమ్మేళనం ఉంటుందని పేర్కొన్నారు. కవులు సాహితి భిమానులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

నవతెలంగాణ-దండేపల్లి

ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తుందని పేద మధ్యతరగతి ప్రజల అభివృద్ధికి అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిందని మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు అన్నారు. సోమవారం మండలంలోని మేదర్పేట గ్రామంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభకు బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వివేక్‌తో కలిసి హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన వంద రోజుల్లోనే ఇచ్చిన హామీలను అమలు చేసిందని గుర్తు చేశారు. మిగతా హామీలను ఎన్నికల తర్వాత అమలు చేస్తారని ఆయన పేర్కొన్నారు. నిరంతరం ప్రజా సంక్షేమ ధ్యేయంగా పనిచేస్తూ ప్రజల మన్ననలు పొందుతున్న ప్రభుత్వమని అన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వంశీని భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. మండలంలోని పలు గ్రామాలకు చెందిన మాజీ సర్పంచ్ ఇతర పార్టీలకు చెందిన నాయకులకు పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థి గడ్డం వంశీ పాల్గొన్నారు.

శివాజీ వీరత్వాన్ని ఆదర్శంగా తీసుకోవాలి

ప్రతి ఒక్కరు శివాజీ వీరత్వాన్ని అందిపుచ్చుకొని నవ సమాజ నిర్మాణానికి పాటుపడాలని మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్‌రావు అన్నారు. సోమవారం అంబేద్కర్ విగ్రహం వద్ద నుండి శివాజీ విగ్రహం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. మండల కేంద్రంలో శివాజీ విగ్రహావిష్కరణ కార్యక్రమానికి హాజరై విగ్రహావిష్కరణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శివాజీ యుద్ధ నైపుణ్యం, పరిపాలన ఆదర్శమని కొనియాడారు. ధైర్యసాహసాలకు మారు పేరు ఛత్రపతి శివాజీ అని గుర్తుచేశారు. మత సామరస్యాన్ని చాటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వివేక్, పెద్దపల్లి కాంగ్రెస్ పార్లమెంట్ అభ్యర్థి గడ్డం వంశీ, కాంగ్రెస్ మండల ప్రజా ప్రతినిధులు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



లక్షెట్టిపేటలో..

- మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు



దండేపల్లిలో..

లక్షెట్టిపేట : పెద్దపల్లి లోక్ సభ ఎన్నికల్లో కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణ లక్ష మెజార్టీతో గెలుపు ఖాయమని, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ 14 సీట్లు సాధిస్తుందని ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు అన్నారు. లక్షెటిపేట పట్టణంలోని ఎస్‌పీఆర్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన కాంగ్రెస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఎంపీ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ మళ్లీ అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్ని తూట్లు పొడుస్తుందని ఆరోపించారు. గత పదేళ్లలో బీజేపీ మతతత్వ రాజకీయం చేసి మతాల మధ్య చిచ్చుపెడుతోందని విమర్శించారు.

యువతను అన్ని రంగాల్లో ప్రోత్సహిస్తాం

యువతను అన్ని రంగాల్లో ప్రోత్సహిస్తామని, ఉపాధి కల్పన లక్ష్యంగా ముందుకు సాగుతానని కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణ అన్నారు. కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు తాను ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని తెలిపారు. తాత గడ్డం వెంకటస్వామి అడుగుజాడల్లో నడుస్తూ అభివృద్ధి లక్ష్యంగా ముందుకు సాగుతుందని పేర్కొన్నారు. అనంతరం లక్షెట్టిపేట మాజీ ఎంపీపీ కొత్త వెంకటేశ్వర్లు, వైస్ ఎంపీపీ కట్ల చంద్రయ్య, మాజీ సర్పంచ్ నడిమెట్ల రాజన్న, సీనియర్ నాయకులు వెంకటస్వామి, వార్డు సభ్యులు ఎనగందుల సుధాకర్, పలువురు నాయకులు కాంగ్రెస్‌లో చేరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఫ్లోర్ లీడర్ చెల్లా నాగభూషణం, జిల్లా ఉపాధ్యక్షులు చింత అశోక్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు పూర్ణ చందర్ రావు, గుండ బుచ్చన్న, మండల అధ్యక్షుడు పింగిలి రమేష్, పట్టణ అధ్యక్షుడు ఆరిఫ్ పాల్గొన్నారు.

పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో లెనిన్ జయంతి



నవతెలంగాణ-జన్నారం

మహా ఉపాధ్యాయుడు లెనిన్ 154వ జయంతిని పీడీఎస్‌యూఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా అధ్యక్షులు ప్రభంజనం మాట్లాడుతూ 1870వ సంవత్సరం ఏప్రిల్ 22వ తేదీన లెనిన్ జన్మించారని, ఎన్నో రచనలు, పుస్తకాలు రచించారని అన్నారు. కార్మిక విప్లవంలో లెనిన్ కీలక పాత్ర పోషించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో యోగేష్, సమీర్, గోపి, హరీష్‌గౌడ్, మహేష్, అరుణ్ కుమార్ పాల్గొన్నారు

రేషన్ బియ్యం పట్టివేత

నవతెలంగాణ-కాసిపేట

మండలంలోని కోమటిచేను వద్ద అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తుండగా పట్టుకున్నట్లు కాసిపేట ఎస్ఐ ప్రవీణ్ కుమార్ తెలిపారు. సుల్తానాబాద్‌కు చెందిన తూర్పాటి మహేష్ సోమవారం మండలంలోని ఆయా గ్రామాల నుంచి ప్రజల వద్ద రేషన్ 4 క్వింటాళ్ల బియ్యాన్ని కొనుగోలు చేసి ఏపీ 28 వై 9641 ఆటోలో మహారాష్ట్రకు తరలిస్తుండగా మార్గ మధ్యంలో కోమటిచేను గ్రామ శివారులో గల బస్టాండ్ వద్ద పట్టుకున్నట్లు వివరించారు. నాలుగు క్వింటాళ్ల బియ్యాన్ని, ఆటోను సీజ్ చేసి, అతనిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

నవతెలంగాణ
నమ్మదగిన తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్
మంగళవారం | ఏప్రిల్ 23, 2024 | www.navatelangana.com

హనుమాన్ విగ్రహ ప్రతిష్టాపన

నవతెలంగాణ-బేల

నూతన ఆలయాల నిర్మాణం, ఆలయాల అభివృద్ధికి గత బీఆర్ఎస్ ప్రభుత్వం కోట్లాది రూపాయల నిధులను కేటాయించిందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు జోగు రామన్న తెలిపారు. సోమవారం మండలంలోని మసాలా(కె) గ్రామపంచాయితీ పరిధిలోని బోరిగావ్ గ్రామంలో నూతనంగా నిర్మించిన హనుమాన్ ఆలయ విగ్రహ ప్రతిష్టాపన వేడుకలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అడనేశ్వర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆలయ నిర్మాణాన్ని సొంత ఖర్చులతో రూ.9లక్షలతో చేపట్టడం పట్ల ఫౌండేషన్ చైర్మెన్ సతీష్, ప్రకాష్ పవార్‌ను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మెన్ రావుత్ మనోహర్, మండల నాయకులు గంబీర్ ఠాక్రే, దేవన్న, జక్కుల మధుకర్, జితేందర్, తన్వీర్ ఖాన్,, విపిన్ ఖోడే, మెంతెం దత్తు, రోహిదాస్, ప్రతాప్, చరణ్ సింగ్, పాల్గొన్నారు.

గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు పనిచేయాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ పార్లమెంట్ స్థానాన్ని కైవసం చేసుకోవడమే లక్ష్యంగా ప్రతి కార్యకర్త పని చేయాలని ఎమ్మెల్యే పాయల శంకర్ పిలుపునిచ్చారు. సోమవారం దుర్గానగర్‌లోని దుర్గామాత ఆలయంలో ప్రచార రథాలకు పూజలు చేసి ప్రారంభించారు. ఆలయ ప్రధాన అర్చకులు కిషన్ మహారాజ్ ప్రత్యేక పూజలు చేసి ఆశీర్వాచనలు అందించారు. అనంతరం హనుమాన్ శోభయాత్ర కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 3వసారి కూడా ప్రధానిగా నరేంద్ర మోడీని చూడాలని ప్రజలు బలంగా సంకల్పించారన్నారు. కార్యకర్తలు కూడా క్షేత్రస్థాయిలో పనిచేసి ఎంపీ అభ్యర్థి గెలుపుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీ అభ్యర్థి గోడం నగేష్, పార్టీ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బ్రహ్మానందం, వకుళభరణం ఆదినాథ్, నాయకులు లాలామున్న, ముకుంద్ పాల్గొన్నారు.

హామీల వర్షం..హస్తంలో ఉత్సాహం..!

▶ కాంగ్రెస్‌లో నూతనోత్తేజం నింపిన సీఎం పర్యటన ▶ సీసీఐ పునరుద్దరణ..యూనివర్సిటీ ఏర్పాటుకు హామీ ▶ ప్రాణహిత, కుప్టి ప్రాజెక్టుల నిర్మాణానికి భరోసా
▶ లోక్‌సభ ఎన్నికల్లో అభ్యర్థి సుగుణను గెలిపించాలని పిలుపు ▶ జనజాతర సభకు భారీగా హాజరైన జనం

నవతెలంగాణ-ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి, ఆదిలాబాద్ టౌన్

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జిల్లా పర్యటన కాంగ్రెస్ శ్రేణుల్లో ఉత్సాహం నింపింది. జిల్లాపై వరాల జల్లు కురిపించడంతో ఆ పార్టీ శ్రేణుల్లో నూతనోతేజం నింపింది. రానున్న పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి విజయానికి ఈ హామీలు దోహదపడుతాయని హర్షం వ్యక్తం చేస్తున్నారు. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించాలని.. ప్రజల ఆశలు, ఆకాంక్షలు తప్పకుండా నెరవేరుస్తామని భరోసా నింపారు. ప్రస్తుత పథకాలు మరింత సమర్థవంతంగా అమలు కావాలంటే అభ్యర్థి గెలుపు ఆవశ్యకమని స్పష్టం చేయడం ఆ పార్టీ శ్రేణుల్లోనే గెలుపుపై మరింత భరోసా నింపింది. సోమవారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ నిర్వహించిన జనజాతర సభకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హాజరయ్యారు. లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేస్తున్న ఆత్రం సుగుణను గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. సభకు భారీగా జనం హాజరుకావడం పట్ల లోక్‌సభ ఎన్నికల్లో ఆ పార్టీ విజయంపై శ్రేణులు ధీమా వ్యక్తం చేస్తున్నాయి. సీఎం ప్రసంగిస్తున్న సమయంలో పార్టీ కార్యకర్తలు చప్పట్లు, కేరింతలతో ఉత్సాహాన్ని కనబర్చారు.

జిల్లాకు వరాల జల్లు..!

జిల్లాపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వరాల జల్లు కురిపించారు. ఆదిలాబాద్ జిల్లా ప్రజలకు వరంలా ఉన్న సీసీఐని ప్రధాని మోడీ, మాజీ సీఎం కేసీఆర్ కలిసి మూసివేయించారని.. తాజాగా కాంగ్రెస్ ప్రభుత్వం పునరుద్దరిస్తుందని హామీనిచ్చారు. ప్రయివేటు వ్యక్తులతో మాట్లాడి ఈ పరిశ్రమను తెరిపిస్తామని నిరుద్యోగులు, వ్యాపారులకు మాట ఇస్తున్నానని.. ఎస్ఎస్‌యూఐ నేతల విజ్ఞప్తి మేరకు జిల్లాలో యూనివర్సిటీని ఏర్పాటు చేసి ఉన్నత చదువులకు అవకాశం కల్పిస్తామని సీఎం భరోసా ఇచ్చారు. కుమురంభీం జిల్లాలో తుమ్మిడిహేటి వద్ద ప్రాణహిత నదిపై ప్రాజెక్టు నిర్మిస్తామని..ఇందుకు మహారాష్ట్ర ప్రభుత్వంతో చర్చలు జరుగుతున్నాయని చెప్పారు. 1900 ఎకరాలు ముంపునకు గురవుతాయని ఈ విషయపై పొరుగు రాష్ట్రాన్ని ఒప్పిస్తామని భరోసా ఇచ్చారు. ఈ ప్రాజెక్టుకు మళ్లీ డా.బీఆర్.అంబేద్కర్ పేరు పెడుతామని చెప్పారు. బోథ్ నియోజకవర్గంలో కుప్టి ప్రాజెక్టు నిర్మాణంపై అప్పటి ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని.. కాంగ్రెస్ ప్రభుత్వం ఈ ప్రాజెక్టు కట్టి భూములను సస్యశ్యామలం చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు.

పేదింటి ఆడబిడ్డను ఆశీర్వదించాలి

గత 25ఏండ్లుగా ప్రజా జీవితంలో ఉండి..వారి సమస్యల పరిష్కారంలో తోడునీడగా నిలిచిన గిరిజన బిడ్డ ఆత్రం సుగుణను గెలిపించాల్సిన అవసరం ఉందని సీఎం విజ్ఞప్తి చేశారు. ఉపాధ్యాయ వృత్తికి రాజీనామా చేసి ఎన్నికల్లో పోటీ చేస్తోందని ఆదరించాలని కోరారు.



బీఆర్ఎస్, బీజేపీ నుంచి బరిలో నిలిచిన ఆత్రం సక్కు, గోడం నగేష్ అనేక పదవులు అనుభవించారని.. నగేష్ గిరిజనుల్లో దొరలా ఉంటారని అలాంటి వ్యక్తికి ఓటేయడం అవసరమా అని వ్యంగ్యస్త్రాలు సంధించారు. కాంగ్రెస్ పేదింటి ఆడబిడ్డకు టికెట్ ఇచ్చిందని భారీ మెజార్టీతో గెలిపించాల్సిన బాధ్యత ప్రజలపై ఉందని తెలిపారు. ప్రభుత్వం ఆరు గ్యారెంటీలను మరింత సమర్థవంతంగా అమలు చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కేంద్రమంత్రి వేణుగోపాలచారి, మాజీ ఎమ్మెల్సీ పురాణం సతీష్, మాజీ ఎమ్మెల్యేలు రాథోడ్ బాపురావు, రేఖానాయక్, కోనేరు కోనప్ప, నియోజకవర్గ ఇన్‌ఛార్జిలు కంది శ్రీనివాస్‌రెడ్డి, శ్రీహరిరావు, నారాయణరావుపటేల్, శ్యాంనాయక్, ఆడె గజేందర్, ముఖ్య నాయకులు పాల్గొన్నారు.







సబ్జెక్టు లేని విమర్శలు చేస్తే ఊరుకోం

- బీజేపీ ఎంపీ అభ్యర్థి గోడం నగేష్
- సీఎం రేవంత్ వ్యాఖ్యల ఖండన



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

30 ఏండ్ల స్వచ్ఛమైన తన రాజకీయ జీవితంపై ఏమి మాట్లాడాలో తెలియక సబ్జెక్టు లేని విమర్శలు చేస్తున్నారని, అలాంటి విమర్శలు చేస్తే ఊరుకోమని బీజేపీ ఎంపీ అభ్యర్థి గోడం నగేష్ అన్నారు. ఇంద్రవెల్లి హంతకులే ఎన్నికల సందర్భంగా నేడు సంతాప సభలు పెడుతూ ఆదివాసుల ఓట్ల కోసం ప్రయత్నిస్తున్నారని ఎద్దేవా చేశారు. సోమవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. రేవంత్ రెడ్డి ఆదిలాబాద్ ఎన్నికల ప్రచార సభలో తప్పుడు మాటల చెప్పి ఓట్లు దండుకోవడానికి ప్రయత్నిస్తున్నారని అన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో అధికారంలోకి వస్తే డిసెంబరు 9న ఆరు గ్యారంటీలను అమలు చేస్తామని చెప్పి విఫలమైన కాంగ్రెస్ ప్రభుత్వం బహిరంగంగా రాష్ట్ర ప్రజలకు లెంపలేసుకుని క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. 1981లో అమాయక ఆదివాసులను నిర్దాక్షిణ్యంగా కాల్చి చంపిన కాంగ్రెస్ పార్టీ ఇప్పుడు ఆదివాసుల ఓట్ల కోసం సంతాపాలు నిర్వహిస్తు కపట నాటకాలు ఆడుతు సిగ్గు లేకుండ వ్యవహరిస్తుందని అన్నారు. తాను 30 సంవత్సరాలుగా రాజకీయాలలో ఉన్నానని, మంత్రిగా, ఎంపీగా, ఎమ్మెల్యేగా ప్రత్యేక నిధులతో ఈ ప్రాంతంలో అభివృద్ధి చేపట్టినప్పుడు రేవంత్‌రెడ్డి ఎక్కడున్నాడో కూడ తెలియదని ఎద్దేవా చేశారు. తన 30 సంవత్సరాల రాజకీయ జీవితంలో ఎక్కడైన, ఏదైనా అవినీతి మరక ఉంటే, అక్రమాలు జరిగి ఉంటే బయటపెట్టాలని చాలెంజ్ చేశారు. అంతేకాని సబ్జెక్టు లేని విమర్శలు చేస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. ఆదిలాబాద్ పార్లమెంట్ స్థానంతో పాటు రాష్ట్రంలో 14 స్థానాలలో గెలవబోతున్నామని ధీమా వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో నాయకులు ఆదినాథ్, నగేష్, లాలా మున్న, జోగు రవి, సోమ రవి, దయాకర్ ఉన్నారు.

కిడ్నీ బాధితుడికి ఆర్థిక సాయం



నవతెలంగాణ-జన్నారం

మండలం రోటి గూడ గ్రామానికి చెందిన భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకుడు శక్తి కేంద్రం ఇన్‌చార్జి రెండు కిడ్నీలు ఫెయిల్ అయి ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న చేపూరి గోపాల్‌కు బీజేపీ మండల అధ్యక్షులు గుండవరపు మధుసూదన్ రావు రూ.5 వేల ఆర్థిక సాయం అందజేవారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల జిల్లా కార్యదర్శి, ఎంపీటీసీ కొంతం శంకరయ్య, రోటి గూడ బూత్ అధ్యక్షుడు ఉప్పు రాజన్న, మేడా అశోక్, జలంధర్, స్వామి, పల్లె లచ్చన్న, కొంతం తిరుపతి పాల్గొన్నారు

పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

- ప్లాంటేషన్ మేనేజర్ సురేష్ కుమార్



నవతెలంగాణ-జైపూర్

పర్యావరణాన్ని పరిరక్షించుకోవడం ప్రతి ఒక్కరు బాధ్యతగా భావించాలని అటవీ అభివృద్ధి సంస్థ మంచిర్యాల రేంజ్ ప్లాంటేషన్ మేనేజర్ గోగు సురేష్ తెలిపారు. ప్రపంచ ధరిత్రీ దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం కోటపల్లి మండలం సర్వాయిపేట్ సమీపంలో పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలను సిబ్బందితో కలిసి సేకరించి నిర్లక్ష్యంగా ప్లాస్టిక్ పడవేయడం పట్ల అవగాహన కల్పించారు. ఇష్టం వచ్చినట్లు ప్లాస్టిక్ వ్యర్థాలను పడేస్తున్నారని ఫలితంగా పర్యావరణ కాలుష్యం ఏర్పడుతుందని తెలిపారు. అదేవిధంగా అడవిలో సంచరించే జీవరాశులు వీటిని తిని మృత్యువాతన పడుతాయని పేర్కొన్నారు. సాధ్యమైనంత వరకు ప్లాస్టిక్ నియంత్రణకు ప్రతి ఒక్కరు సహకరించాలని కోరారు. అదేవిధంగా ఎండ కాలంలో అగ్ని ప్రమాదాల బారిన పడకుండా కాపాడే బాధ్యతలో అటవీశాఖ వారికి ప్రతి ఒక్కరు సహకరించాలని అన్నారు.

కాలువలో పడి యువకుడు మృతి

నవతెలంగాణ-మంచిర్యాల

మంచిర్యాల పట్టణలోని ఎన్టీఆర్‌నగర్‌కు చెందిన తగరపు భిక్షపతిక(35) ఆదివారం సాయంత్రం ఎల్ఐసీ కాలనిలోని కాలువలో పడి మృతి చెందినట్లు మంచిర్యాల పట్టణ ఎస్ఐ ప్రశాంత్ తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. భిక్షపతి కూలి పని చేసి ఇంటికి తిరిగి వెళ్ళే క్రమంలో కల్వర్టుపై కూర్చొని ఉన్నాడు. కూర్చున్న సమయంలో అదుపుతప్పి వెనుకాల ఉన్న కల్వర్టులో పడిపోయాడు. గమనించిన కుటుంబ సభ్యులు, స్థానికులు వెంటనే మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. భార్య కవిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

గనులపై బీఆర్ఎస్ అభ్యర్థి ప్రచారం



నవతెలంగాణ-నస్పూర్

శ్రీరాంపూర్ ఏరియాలోని ఆర్కె 7, 7ఏ గనులపై బీఆర్ఎస్ పెద్దపల్లి పార్లమెంట్ అభ్యర్థి, మాజీమంత్రి కొప్పుల ఈశ్వర్, మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్ రావు, టీబీజీకేఎస్ కేంద్ర స్టీరింగ్ కమిటి చైర్మెన్ మిర్యాల రాజిరెడ్డిలతో కలిసి సోమవారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సింగరేణిలో 26 సంవత్సరాలు కార్మికునిగా పనిచేసిన తనకు కార్మికుల కష్టాలు తెలుసునని, కార్పొరేట్ సంస్థ యజమానికి కార్మికుల కష్టాలు ఎలా తెలుస్తాయన్నారు. గనులపై కార్మికులతో కలిసి బొగ్గు టబ్బులు దొబ్బి కార్మికులతో మమేకమయ్యారు. అనంతరం గనులపై డిపార్ట్మెంటుల వారీగా కార్మికులను కలిసి తన కారుగుర్తుకు ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. గనులపై తాను' తిరుగుతుంటే తాను కార్మికునిగా పనిచేసిన రోజులు గుర్తుకు వస్తున్నాయని చెప్పారు. తనను ఎంపీగా గెలిపిస్తే పార్లమెంటులో కార్మికుల గొంతుకనవుతానని అన్నారు. పార్లమెంటులో బొగ్గు గని కార్మికుల ఐటీ రద్దుకు కృషి చేస్తానని, సమస్యలు పరిష్కరించిన కేసీఆర్ పట్ల కార్మికుల్లో మంచి ఆధరణ ఉందన్నారు. అనేక హక్కులు కల్పించిన కేసీఆర్‌పై నమ్మకం, విశ్వాసం వ్యక్తం చేస్తున్నారని పేర్కొన్నారు. సింగరేణిలో 20 వేల మంది యువతకు ఉద్యోగాలు కల్పించిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వం, కేసీఆర్‌దేనని గుర్తు చేశారు. కారుణ్య ఉద్యోగాలు కొనసాగుతున్నన్ని రోజులు కార్మికులు కేసీఆర్‌ను మరిచి పోలేరని చెప్పారు. నస్పూర్ మున్సిపాలిటీలోని శ్రీరాంపూర్ బస్టాండ్ నుండి ఆర్కే6 కొత్త రోడ్డు వరకు, సీసీసీ కార్నర్ నుండి రాయల్ టాకీస్, షిర్కే, తెలంగాణ తల్లి విగ్రహం వరకు ఉన్న ప్రతి షాపు వద్దకు వెళ్లి రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో గెలిపించాలని కోరారు. ఆయనతో పాటు టీబీజీకేఎస్ కేంద్ర స్టీరింగ్ కమిటీ సభ్యుడు కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి, బండి రమేష్, పానగంటి సత్తయ్య, తొంగల రమేశ్, పుప్పాల సంపత్, రాజునాయక్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు నడిపెల్లి విజిత్‌రావు, మాజీ మున్సిపల్ చైర్మెన్ ఇసంపెల్లి ప్రభాకర్, పట్టణ అధ్యక్షుడు అక్కూరి సుబ్బయ్య, ప్రధాన కార్యదర్శి మేరుగు పవన్, మాజీ జడ్పీటీసీ తిప్పని రామయ్య, మాజీ సర్పంచ్ జగ్గయ్య, టీబీజీకేఎస్ నాయకులు కౌన్సిలర్ వంగ తిరుపతి, బేర సత్యనారాయణ, జనార్ధ నాయకులు అన్వేష్‌రెడ్డి, గర్సె రామస్వామి, రఫీఖాన్, గాజం ఎల్లయ్య, బండి తిరుపతి, రఫీఖ్ ఖాన్, రవి గౌడ్, పొగాకు రమేశ్, పెద్దపల్లి రామయ్య పాల్గొన్నారు.

పాఠశాలల్లోని పనులు గడువులోగా పూర్తి చేయాలి

నవతెలంగాణ-నిర్మల్

అమ్మ ఆదర్శ పాఠశాల కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో పనులను ప్రారంభించి, నిర్దేశించిన గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో సంబంధిత శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. అమ్మ ఆదర్శ పాఠశాల కార్యక్రమంలో భాగంగా పట్టణ, గ్రామీణ ప్రాంతాలలో వెంటనే పనులను ప్రారంభించాలని సూచించారు. కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని 672 ప్రభుత్వ పాఠశాలల్లో తాగునీరు, విద్యుత్ సౌకర్యాలు, సౌర ఫలకల ఏర్పాటు, మరుగుదొడ్ల నిర్మాణం, నిర్వహణ, స్లాబ్ల మరమ్మత్తులు, గ్రిల్స్ ఏర్పాటు, ఇతర మౌళిక సదుపాయాల కల్పన, మరమ్మత్తులు చేపట్టాలని ఆదేశించారు. ఈజీఎస్ కింద మరుగుదొడ్లను నిర్మాణాలను చేపట్టాలని సూచించారు. పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని అన్నారు. వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభమయ్యే నాటికి విద్యార్థులకు అన్ని సౌకర్యాలు సిద్ధంగా ఉండాలని సూచించారు. పనుల ప్రారంభానికి ముందు, పనులు పూర్తి అయిన తర్వాత ఫోటోలతో కూడిన నివేదికలు సమర్పించాలని ఆదేశించారు. సమావేశంలో డీఈఓ రవీందర్‌రెడ్డి, డీఆర్డీఓ విజయలక్ష్మి, ఆర్ అండ్ బి, పంచాయతీరాజ్ ఈఈలు అశోక్ కుమార్, శంకరయ్య, నిర్మల్, భైంసా, ఖానాపూర్ మున్సిపల్ కమిషనర్లు రాజు, వెంకటేశ్వర్‌రావ్, మనోహర్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



బీజేపీ కార్యాలయాన్ని ప్రారంభించిన గోడం నగేష్

నవతెలంగాణ-బజార్‌హత్నూర్

మండల కేంద్రంలో బీజేపీ పార్టీ కార్యాలయాన్ని సోమవారం బీజేపీ ఎంపీ అభ్యర్థి గోడం నగేష్ రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షులు పతంగే బ్రహ్మానంద్ మాట్లాడుతూ ప్రతి ఒక్క కార్యకర్త ఉద్యమంలో పార్టీ గెలుపు కోసం ఎల్లవేళలా కృషి చేయాలని కోరారు. ప్రతి ఊరు వాడ గడప గడపకు ప్రచారం నిర్వహించి, బీజేపీ అభ్యర్థి గోడం నగేష్‌ను భారీ మెజారిటీతో గెలిపించే బాధ్యత కార్యకర్తలపై ఉందని కొనియాడారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షులు పోరెడ్డి శ్రీనివాస్, పార్టీ కార్యకర్తలు సంతోష్, కేవల్ సింగ్, నాజెం రమణ, జాంసింగ్ పాల్గొన్నారు.

లారీ ఢీకొన్న ప్రమాదంలో బాలుడికి తీవ్రగాయాలు

- రిమ్స్ తరలింపు.. పరిస్థితి విషమం



నవతెలంగాణ-నేరడిగొండ :

బైక్‌పై వెళుతున్న వారిని లారీ ఢీకొన్న ప్రమాదంలో బాలుడికి తీవ్రగాయాలైన సంఘటన మండలంలోని లక్కంపూర్ గ్రామం వద్ద ఎన్‌హెచ్ 44పై సోమవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. వేసవి సెలవులు ఉండటంతో లోకేశ్వరం మండలానికి చెందిన బాబు, ఇచ్చోడ గురుకుల పాఠశాలలో చదువుతున్న తన కుమారున్ని తీసుకువచ్చేందుకు ద్విచక్ర వాహనంపై వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో మండలంలోని లక్కంపూర్ వద్ద వారిని లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బాబు కుమారుడు సంజయ్(12) తీవ్రగాయాలయ్యాయి. గమనించిన స్థానికులు వెంటనే 108కు ఫోన్ చేసి క్షతగాత్రులను రిమ్స్‌కు తరలించారు. ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

నరేంద్ర మోడీని మూడో సారి ప్రధాన మంత్రి చేయాలి

- ఎమ్మెల్యే పాయల్ శంకర్

నవతెలంగాణ-ఆదిలాబాద్ టౌన్

ప్రపంచ దేశాలను అతలకుతలం చేసిన కరోనా లాంటి ప్రాణాంతక వ్యాధి నుంచి దేశ ప్రజల ప్రాణాలను కాపాడిన ప్రధాన మంత్రి నరేంద్ర మోడీని మూడో సారి ప్రధాన మంత్రి చేయాలని ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. సోమవారం పట్టణంలోని ఓ ప్రయివేటు హాలులో బీజేపీ మహిళ శక్తి సమ్మెళనం నిర్వహించారు. ఇందులో పదేండ్ల ప్రధాని పాలనలో జరిగిన అభివృద్ధిని వివరించారు. పార్లమెంట్ మహిళ ఇన్‌చార్జీ చిట్యాల సుహాసినిరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి పాయల శంకర్‌తో పాటు ఎంపీ అభ్యర్థి గోడం నగేష్, పార్లమెంట్ ప్రభారీ అల్లాపూర్ శ్రీనివాస్, అయ్యన్నగారి భూమయ్యలు హాజరయ్యారు. మే 13న జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థిని గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా మహిళ శక్తి పార్లమెంట్ ఇన్‌చార్జి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు చిట్యాల సుహాసినిరెడ్డి మాట్లాడుతూ మహిళలు అనుకుంటే సాధించలేనిది ఏదీ లేదన్నారు. గత పాలకుల హాయంలో భారత దేశం ఆశించే స్థాయిలో ఉండేదన్నారు. ప్రధాన మంత్రి నరేంద్రమోదీ పాలనలో శాసించే స్థాయికి ఎదిగిందన్నారు. మహిళల కోసం అనేక పథకాలను అమలు చేశారని గుర్తు చేశారు. ఈ సారి కూడా పార్లమెంట్ ఎన్నికల్లో ఎంపీ అభ్యర్థిని కమలం గుర్తుకు ఓటేసి గెలిపించి మూడో సారి ప్రధానిగా నరేంద్ర మోడీని చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ లాలా మధుజైస్వాల్, ఇంద్రవెల్లి జడ్పీటీసీ అర్క పుష్పలత, ధోని జ్యోతి, అనిత, నివేధిత వరేఖ, అలివేలు మంగతయారు, పద్మగౌడ్, సంగీత, ఉజ్వాల, నాయకులు ఆధినాథ్, దయాకర్, గందే విజయ్ కుమార్ పాల్గొన్నారు.